www.prajasakti.com

ప్రజాశక్తి

ఆదివారం 14 ఏప్రిల్ 2024 8 పేజీలు







తూర్పుగోదావరి కాకినాడ కోనసీమ

అడుగడుగునా అక్రమ లే-ఔట్లు

- పుట్టగొడుగుల్లా వెలుస్తున్నా పట్టించుకోని అధికారులు
- ప్రభుత్వ ఖజానాకు రూ.కోట్లాది రూపాయల నష్టం

ప్రజాశక్తి- కడియం

మండలంలోని పలుగ్రామాల్లో అడుగుకో అక్రమ లేఅవుట్ కనిపిస్తోంది. అక్రమ లేఅవట్లు వేసి అనధికారికంగా భూముల క్రయవిక్రయాలు జరుగుతున్నా అధికారులు పట్టనట్టు వ్యవహరించడం పలు అనుమానాలకు తావిస్తోంది. రోజుల వ్యవధి లోనే వ్యవసాయ భూములు, వ్యవసాయేతర భూములుగా మారిపోతున్నాయి. రాత్రికి, రాత్రే వందలాది లారీల గ్రావెల్ తో సాగుభూములను పూడ్చేస్తున్నారు. అసలు భూములు బదలా యింపులు జరుగుతున్నాయా? భూముల్ని గ్రావెల్ తో పూడ్చడానికి అనుమతులు ఉన్నాయా? గ్రావెల్ తరలింపునకు సంబం ధించి మైనింగ్ అనుమతులు పొందుతున్నారా? వీటిని సంబందిత రెవెన్యూ అధికారులు గానీ, పంచాయితీ అధికారులు గానీ, పోలీస్ అధికారులు గానీ, పర్యవేక్షస్తున్నారా? అనేవి జవాబుల్లేని ప్రశ్నలుగానే మిగిలిపోతున్నాయ. రియల్టర్లు అందించే ముడుపులు తీసుకోవడం వల్లే అధికార యంత్రాంగం పట్టనట్టు వ్యవహరిస్తుందనే విమర్శలు వినిపిస్తున్నాయి.

ఎక్కడైనా భూమిని గ్రావెల్తో పూడ్చారంటే చాలు రాబందుల్లా వాలిపో తున్నారు కొందరు దళారులు. మరి కొందరైతే



దుళ్లలో అక్రమంగా ఏర్పాటు చేసిన లేఅవుట్

రియల్టర్ల తరపున బ్రోకర్లుగా పనిచేస్తూ సబంధిత అధికారులకు, స్థానిక ప్రజాప్రతి నిధులకు ముడుపులు అందజేస్తూ దర్జాగా బతికేస్తున్నారు.

మండలంలోని దుళ్ల గ్రామంలో సర్వే నెంబర్ 94/1 గల వ్యవసాయ భూమిని, వ్యవసాయేతర భూమిగా మార్చుకొనేందుకు కొంత రుసుము చెల్లించి రెవెన్యూ శాఖ నుంచి ఇటీవల కాలంలో అనుమతులు పొందారు భూ యజమాని. దుళ్ల గ్రామం 'రూడా' పరిధిలో లేనందున ఈ భూమిలో లేఔట్ వేసేందుకు కచ్చితంగా పంచాయతీ అనుమతులు 2లో..



సమావేశంలో పాల్గొన్న సిపిఐ, సిపిఎం జిల్లా కార్యదర్శులు, నాయకులు

15న లౌకిక రాజ్యాంగ, ప్రజాస్వామ్య పరిరక్షణ సభ

ప్రజాశక్తి - రాజమహేంద్రవరం

నగరంలోని వై.జంక్షన్ వద్ద గల ఆనం రోటరీ హాల్లో లౌకిక రాజ్యాంగ, ప్రజాస్వామ్య పరిరక్షణ సభ జరుగుతుందని, దీన్ని విజయవంతం చేయాలని సిపిఐ, సిపిఎం నాయకులు కోరారు. శనివారం స్థానిక మున్సిపల్ స్టేడియం వద్ద గల సిపిఐ కార్యాల యంలో సిపిఐ, సిపిఎం ఉమ్మడి సమావేశం జరిగింది. ఈ సమావేశంలో సిపిఐ, సిపిఎం తూర్పుగోదావరి జిల్లా కార్యదర్శులు తాటిపాక మధు, టి.అరుణ్ మాట్లాడారు. ఈ సభకు సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ, సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు ముఖ్య అతిథులుగా హాజరవుతున్నారని తెలిపారు. గౌరవ అతిథిగా కాంగ్రెస్ పార్టీ రాజమహేంద్ర వరం పార్లమెంట్ అభ్యర్థి గిడుగు రుద్రరాజు హాజరుకానున్నారని తెలిపారు. ఈ సమావేశానికి జిల్లాలో ఉన్న వామపక్ష పార్టీ నాయకత్వం, ప్రజాస్వామ్యం పరిరక్షణ కావాలని ఆకాంక్షించే ప్రజలందరూ హాజరు కావాలని పిలుపునిచ్చారు. దేశంలో ప్రస్తుతం జరుగుతున్న పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని మతోన్మా దానికి వ్యతిరేకంగా, రాజ్యాంగాన్ని పరిరక్షించు కునే కర్తవ్యం ప్రజలందరిపైనా ఉందన్నారు. ఈ సమావేశంలో సిపిఎం రాజమహేంద్రవరం నగర కార్యదర్శి బి.పవన్, సిపిఎం సీనియర్ నాయకులు ఎస్ఎస్.మూర్తి, సిపిఐ నగర కార్యదర్శి వి.కొండలరావు పాల్గొన్నారు.

బిజెపి హయాంలో రాజ్యాంగ వ్యవస్థలు నిర్వీర్యం

ప్రజాశక్తి -దేవరపల్లి రూరల్

దేశంలో బిజెపి అధికారంలోకొచ్చిన తర్వాత నుంచి రాజ్యాంగ హక్కులను కాలరాస్తుందని, రాజ్యాంగ వ్యవస్థలను నిర్వీర్యం చేస్తుందని రాజమహేంద్రవరం కాంగ్రెస్ పార్టీ పార్లమెంటు నియోజకవర్గ అభ్యర్థి గిడుగు రుద్రరాజు అన్నారు. శనివారం దేవరపల్లిలోని మూడు రోడ్ల కూడలి సమీపంలో కాంగ్రెస్ పార్టీ కార్యాలయాన్ని గిడుగు రుద్రరాజు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బిజెపి అంటే బాబు, జగన్, పవన్ అని ఎద్దేవా చేశారు. రాష్ట్రం అధికారంలోకి రాగానే రాష్టానికి ప్రత్యేక హోదా కల్పిస్తామన్నారు. తాము ఎప్పుడూ పార్టీలు మారలేదని, ఒకే పార్టీలో ఉన్నామన్నారు. ఈ సందర్భంగా గడప గడపకూ 2లో..



సమావేశంలో మాట్లాడుతున్న రుద్రరాజు

రూ.4.08 కోట్ల విలువైన బంగారం, వెండి సీజ్

ప్రజాశక్తి - పిఠాపురం, కడియం

ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లాలో రూ.4.08 కోట్ల విలువైన బంగారం, వెండి నగలను పోలీసునలు స్వాధీనం చేసుకున్నారు. పిఠాపురం మండలంలోని గొల్లప్రోలు టోల్ గెట్ వద్ద ఫ్లయింగ్ స్కాడ్, పోలీసు అధికారులు నిర్వహించిన వాహన తనిఖీల్లో సుమారు రూ.3 కోట్ల విలువ చేసే బంగారం, వెండి బయట పడింది. ఇందులో భాగంగా సీక్వెల్ లాజిస్టిక్స్ చెందిన బొలెరో వాహనాన్ని శనివారం రాత్రి అధికారులు తనిఖీ చేశారు. సంబంధిత వాహనంలో వైజాగ్ నుంచి కాకినాడకు ఎటువంటి రవాణా అనుమతులు 2లో..



పిఠాపురంలో బంగారాన్ని సీజ్ చేస్తున్న పోలీసులు

కార్టూ'నిజం'



శరవేగంగా ఫార్మారంగం అభివృద్ధి

జెఎన్‌టియుకె విసి ప్రసాదరాజు

ప్రజాశక్తి - కాకినాడ

దేశంలో ఫార్మారంగం శరవేగంగా అభివృద్ధి చెందుతుందని, ప్రపంచ ఔషధశాలగా భారతదేశం నిలుస్తుందని జెఎన్‌టియుకె ఉపకులపతి, ప్రొఫెసర్ జివిఆర్.ప్రసాదరాజు తెలిపారు. శనివారం జెఎన్‌టియుకె ప్రాంగణంలో సెనేట్ హాల్లో స్కూల్ ఆఫ్ ఫార్మాస్యూటికల్ సైన్సెస్, టెక్నాలజీస్ (ఎస్ పిఎస్) విభాగం ఆధ్వర్యంలో ఎపి రాష్ట్ర ఫార్మశీ కౌన్సిల్ సహకారంతో నిరంతర విద్యా కార్యక్రమం అనే అంశంపై రేపటి ఫార్మశీ నేటి 21వ శతాబ్ధపు నైపుణ్యాల నిర్మాణం అనే నినాదంతో ఫార్మశీ కౌన్సిల్ రిజిష్టర్డ్ అధ్యాపకులకు ఒకరోజు రిఫ్రెషర్ కోర్సు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ నూతన ఆవిష్కరణలతో కొత్త ఔషధాల అభివృద్ధి, ఉత్పత్తికి నెలవైన ఫార్మా రంగంలో అవకాశాలకు కొదవలేదన్నారు. ఫార్మశీ విద్యార్థులు ప్రయోగాలపై మరింత శ్రద్ధ కనబర్చి నూతన ఆవిష్కరణలు చేపట్టేలా బోధించాలని అధ్యాపకులకు సూచించారు. ఆంధ్రప్రదేశ్ ఫార్మశీ కౌన్సిల్ రిజిస్ట్రార్ డాక్టర్ ఎం.విలియమ్ కేరీ మాట్లాడుతూ నేడు నేర్చుకుని రేపటి తరానికి



సమావేశంలో మాట్లాడుతున్న జెఎన్‌టియుకె విసి ప్రసాదరాజు

అన్వయించుకోవాలన్నారు. ఐదు సంవత్సరాలకు రెండు సార్లు ఇటువంటి ప్రోగ్రాములకు హాజరై ఆ సర్టిఫికెట్‌ను ప్రతీ రిజిష్టర్డ్ ఫార్మశీ అధ్యాపకులు రెన్యువల్ కొరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలన్నారు. కోవిడ్ పరిస్థితులలో ఫార్మా రంగం యొక్క ప్రాధాన్యత మరింత పెరిగిందన్నారు. ఫార్మశీలో ఉన్నత విద్య అభ్యసించిన వారికి ప్లేస్మెంట్స్ అవకాశాలకు కొదవలేదన్నారు. భవిష్యత్తులో ఫార్మా రంగం విస్తరణ, కొత్త ప్రాజెక్ట్ కారణంగా ఉపాధి అవకాశాలు మరింత విస్తృతమవుతాయన్నారు. ఫార్మశీ కౌన్సిల్ ఆఫ్ ఇండియా ఇచ్చిన ఆదేశాల మేరకు ఆంధ్రప్రదేశ్ ఫార్మశీ కౌన్సిల్ నిరంతర విద్యా కార్యక్రమాన్ని ఫార్మశీ కౌన్సిల్ రిజిష్టర్డ్ అధ్యాపకులకు మొదటిసారిగా జెఎన్‌టియుకె స్కూల్ ఆఫ్ ఫార్మాస్యూటికల్ సైన్సెస్, టెక్నాలజీస్ నిర్వహించింది. రెక్టార్ ప్రొఫెసర్ కెవి.రమణ, ఫార్మశీ కోర్సులు స్పెషల్ ఆఫీసర్ ప్రొఫెసర్ జివిఎస్ఆర్.దీక్షితులు పాల్గొనగా, ఎస్‌పిఎస్ విభాగాధిపతి డాక్టర్ బి. భవాని అధ్యక్షత వహించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న అధ్యాపకులకు సర్టిఫికెట్లను అందచేశారు. ఈ కార్యక్రమంలో ఫార్మశీ విభాగం అధ్యాపకులు, బోధనేతర సిబ్బంది పాల్గొన్నారు.

తాత్కాలిక స్ట్రాంగ్‌రూమ్‌కు ఇవిఎంలు


ఇవిఎంల తరలింపును పరిశీలిస్తున్న కలెక్టర్

ప్రజాశక్తి -రాజమహేంద్రవరం రూరల్

రాజమహేంద్రవరం రూరల్ నియోజక వర్గం ఎన్‌ఎసి భవనంలో ఏర్పాటు చేసిన తాత్కాలిక స్ట్రాంగ్ రూమ్ కు తొలి విడత ఇవిఎంలు చేరుకున్నాయని రాజమహేంద్రవరం రూరల్ నియోజక వర్గ రిటర్నింగ్ అధికారి, జాయింట్ కలెక్టర్ ఎన్.తేజ్ భరత్ తెలిపారు. శుక్రవారం రాత్రి రాజమహేంద్రవరం రూరల్ నియో జక వర్గం పరిధిలో ఉన్న 267 పోలింగ్ కేంద్రాలకు సంబంధించిన బ్యాలెట్ యూనిట్స్ కలెక్టరేట్ ఆవరణలో ఉన్న తాత్కాలిక స్ట్రాంగ్ రూమ్ చేరుకునే ప్రక్రియని జెసి స్వయంగా పర్యవేక్షణ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లా డారు. కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి డాక్టర్ కె.మాధవీలత ప్రత్యక్ష పర్యవేక్షణలో ఇవిఎంల తరలింపు జరిగిందన్నారు. నియోజక వర్గ పరిధిలో ఉన్న 267 పోలింగ్ కేంద్రాలకు సంబంధించిన 320 చొప్పున బ్యాలెట్ యూనిట్స్, కంట్రోల్ యూనిట్స్, వివి ప్యాట్స్‌లు రిజర్వ్ యూనిట్స్ కేటాయించారన్నారు. వాటిని అత్యంత భద్రత మధ్య వాహనం ద్వారా రూరల్ స్ట్రాంగ్ రూమ్‌నకు తరలించామన్నారు. 2024 సార్వత్రిక ఎన్నికల కోసం పార్లమెంటు, అసెంబ్లీ నియోజక వర్గాలకు చెందిన బ్యాలెట్ యూనిట్స్, కంట్రోల్ యూనిట్స్, వివి ప్యాట్స్ లను భద్ర పరిచేందుకు అన్ని ఏర్పాట్లు చేశామన్నారు. జిల్లా స్థాయి స్ట్రాంగ్ రూమ్ వద్ద మున్సిపల్ కమిషనర్ కె.దినేష్‌కుమార్, సబ్ కలెక్టర్ అశుతోష్ శ్రీవాత్సవ్, ఆర్‌డిఒ చైత్రవర్షిణి, పార్లమెంటు సహాయ రిటర్నింగ్ అధికారి ఆర్.కృష్ణనాయక్, ట్రైనీ ఎస్‌డిసి ఎం.భవానిప్రకాష్, తదితరులు పాల్గొన్నారు.


కలెక్టర్‌తో మాట్లాడుతున్న పేపరుమిల్లు కార్మికులు

కలెక్టర్‌ను కలిసిన పేపరు మిల్లు కార్మికులు

ప్రజాశక్తి -రాజమహేంద్రవరం రూరల్

పేపరు మిల్లు కార్మిక, ఉద్యోగ సంఘాల ప్రతినిధులు శనివారం కలెక్టర్ డాక్టర్ కె.మాధవీలత, ఎస్‌పి పి.జగదీష్‌లను కలిశారు. వేతనాలు ఇతర సమస్యలను వారికి వివరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాధవీలత మాట్లాడుతూ రాజమండ్రి పేపరు మిల్లు కార్మిక ఉద్యోగ సంఘాల, యాజమాన్య ప్రతినిధులు కలిసి జీతాలు పెంపు, తదితర 22 అంశాలను తమ దృష్టికి తీసుకొచ్చారన్నారు. వీటిపై పేపర్ మిల్లు యాజమాన్య ప్రతినిధులు, కార్మిక సంఘాల నాయకులతో కలిసి చర్చరు జరుపుతామన్నారు. కార్మిక శాఖ సంయుక్త కమిషనర్ ఎ.రాణి, అదనపు ఎస్‌పి పి.అనిల్‌కుమార్, ఎసి లేబర్ ఎఎస్‌ఎం.వలీ పాల్గొన్నారు.

చాగల్లులో ప్రజా ఆశీర్వాద యాత్ర

ప్రజాశక్తి - చాగల్లు

చాగల్లు గ్రామంలో శనివారం రెండో రోజు ప్రజా ఆశీర్వాద యాత్రను నిర్వహించారు. కొవ్వూరు అసెంబ్లీ నియోజకవర్గం వైసిపి అభ్యర్థి తలారి వెంకట్రావు పాల్గొన్నారు. ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ పథకాలను వివరించారు. రానున్న ఎన్నికల్లో వైసిపిని గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో వైసిపి మండల అధ్యక్షుడు డాక్టర్ చెల్లింకల దుర్గామల్లేశ్వరరావు సీనియర్ నాయకులు బొర్రా కృష్ణ, పోతురాజు పుల్లారావు, ఇంటి రాజు, జాలెం వెంకట్రావు నియోజవర్గ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు


పండితులతో ఎంఎల్ఎ జక్కంపూడి రాజా

వెంకన్నను దర్శించుకున్న జక్కంపూడి

ప్రజాశక్తి - గోకవరం

మండలంలోని గుమ్మళ్లదొడ్డి గ్రామంలో వాల్మీక వెంకటేశ్వర స్వామిని రాజానగరం ఎంఎల్ఎ, అసెంబ్లీ వైసిపి అభ్యర్థి జక్కంపూడి రాజా శనివారం దర్శించుకున్నారు. ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ ధర్మకర్త పులగం కృష్ణ, ఎంఎల్ఎ రాజాకు ఘనంగా స్వాగతం పలికారు. ఆలయ అర్చక స్వామి ఎస్‌టిపి.కృష్ణమాచార్యులున ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. రానున్న ఎన్నికల్లో విజయం సాధించాలని రాజాను ఆశీర్వదించారు.

తంటికొండలో వైసిపి ఎన్నికల ప్రచారం

ప్రజాశక్తి - గోకవరం

మండలంలోని తంటికొండ గ్రామంలో శనివారం జగ్గంపేట నియోజకవర్గ వైసిపి అభ్యర్థి తోట నరసింహం సతీమణి తోట వాణి, కోడలు తోట శ్రీనిధి, వైసిపి నాయకులు ప్రచారం నిర్వహించారు. స్థానిక నాయకులుతో కలిసి ప్రతి ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ పథకాలను ప్రజలకువ వివరించారు. సంక్షేమ పథకాలు అమలు కావాలంటే వైసిపికి మళ్లీ పట్టం కట్టాలన్నారు. ఈ కార్యక్రమంలో వైసిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

అంబేద్కర్ జయంతిపై ఆంక్షలు

ప్రజాశక్తి - కడియం

బిఆర్ అంబేద్కర్ జయంతి సందర్భంగా వేడుకలకు, ఊరేగింపులు నిర్వహించేందుకు అనుమతులు లేవని కడియం సిఐ బి.తులసీధర్ తెలిపారు. ఎన్నికల నేప థ్యంలో కోడ్ నేపథ్యంలో ఎటువంటి ర్యాలీలు, డిజెలు నిర్వ హించరాదన్నారు. సెక్షన్30, 144లు అమల్లో ఉన్నా యన్నారు. నిషేధాజ్ఞలు నేపథ్యంలో నిబంధనలను కచ్చితంగా పాటించాలని కోరారు. సైలెన్సర్లు తీసి రోడ్డుపై తిరగొద్దన్నారు. ట్రిపుల్ రైడింగ్‌లు చేస్తూ ర్యాలీ చేసిన వారిపైన చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఆయా విగ్రహ కమిటీ నిర్వాహకులు విగ్రహాల వద్దనే కార్యక్రమాలు నిర్వహించుకోవాలని తెలిపారు.

ఉద్యమకారులను స్ఫూర్తిగా తీసుకోవాలి


ఉపాధ్యాయ అమరులకు నివాళులర్పిస్తున్న యుటిఎఫ్ నేతలు

ప్రజాశక్తి- కడియం

సంక్షేమ, విజ్ఞాన, సమసమాజం కోసం జీవితాలను త్యాగం చేసిన ఉద్యమకారుల కృషిని అందరూ స్ఫూర్తిగా తీసుకోవాలని యుటిఎఫ్ జిల్లా కార్యదర్శ ఎ.షరీఫ్, కోశాధికారి ఇవిఎస్‌ఆర్.ప్రసాద్ పేర్కొన్నారు. శనివారం వేమగిరిలో యుటిఎఫ్ ఆధ్వర్యంలో చెన్నుపాటి లక్ష్మయ్య, అప్పారి వెంకటస్వామి, ఎవి.సూర్యనారాయణరాజు, దేశంలో బడుగుల్లో విద్యా వ్యాప్తి కోసం కషి చేసిన పూలే, తొలి తరం ఉపాధ్యాయిని సావిత్రిబాయి పూలే, రాజ్యాంగ నిర్మాత బిఆర్.అంబేద్కర్ చిత్రపటాలకు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. యుటిఎఫ్ మండల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు బి.అబ్బాయి, వేదుల శాస్త్రి మాట్లాడుతూ నాటితరం నాయకుల త్యాగాలు నేటి యువతకు తెలియజేయడానికి యుటిఎఫ్ మండల, జిల్లా, రాష్ట్ర స్థాయిల్లో సదస్సులు నిర్వహిస్తుందన్నారు. హక్కులు, బాధ్యతలు యుటిఎఫ్‌కి రెండు కళ్లు అన్నారు. రాష్ట్ర యుటిఎఫ్ కౌన్సిలర్ ఎస్ అనిత, చిలుకూరి శ్రీనివాసరావు మాట్లాడుతూ పాఠశాలలో విద్యార్థులు నమోదుకు కృషి చేయాలన్నారు.

మానసిక వికాలంగులకు పండ్లు పంపిణీ

ప్రజాశక్తి - ఉండ్రాజవరం

ప్రోగ్రెసివ్ సైకాలాజిస్ట్స్ అసోసియేషన్ ఇండియా శనివారం అసోసియేషన్ జాతీయ అధ్యక్షులు డాక్టర్ హిప్నో కమలాకర్ జయంతిని పురస్కరించుకుని మైండ్ అండ్ పర్సనాలిటీ కేర్, తణుకు బ్రాంచ్ ఆధ్వర్యంలో పాలంగి, స్పందన మానసిక వికలాంగుల ఆశ్రమంలో పళ్ళు, ఫలహారాలు పంపిణీ చేశారు. ఈ సంద ర్భంగా అసోసియేషన్ జాతీయ అధ్యక్షురాలు డాక్టర్ హిప్నోపద్మకమలాకర్ మాట్లాడుతూ ఆయన సేవలను స్మరించుకొంటూ జాతీయ స్థాయిలో అనేక చోట్ల పలు సేవ కార్యక్రమాలు చేపట్టారన్నారు. డాక్టర్ హిప్నో కమలాకర్ మూఢ నమ్మకాలు, మూఢ విశ్వాసాలకు వ్యతిరే కంగా అనేక సామాజిక కార్య క్రమాలను ఉభయ రాష్ట్రాల్లో చేశారని, సమాజ అభివృద్ధికి ఎనలేని కృషి చేశారని అసో సియేషన్ ఆంధ్రప్రదేశ్ అధ్య క్షులు డాక్టర్ వి.జనార్ధనం కొనియాడారు. హిప్నో కమ లాకర్ రచనలు ప్రజలను చైతన్య పరచి, వారి మనోవికా సానికీ దోహద పడతా యన్నారు. కాకినాడ జిల్లా అధ్యక్షులు డాక్టర్ ఎంఎస్.శ్రీనివాస్ మాట్లాడుతూ ప్రస్తుత సమాజంలో ఉన్న సైకాలజిస్టులకు డాక్టర్ హిప్నో కమలాకర్ ఒక ప్రత్యేక గుర్తింపును తీసుకొచ్చి మార్గదర్శకులుగా నిలిచారన్నారు. సైకా లజీ రంగంను ఉన్నత స్థానంలో నిలబెట్టడానికి అనితర కషి చేశారని జాతీయ కన్వీనర్ డా. పేరు బోయిన రమేష్‌కుమార్ తెలిపారు. రాజమహేంద్రవరం అధ్యక్షులు పాలపర్తి శ్రీనివాస్, కోనసీమ జిల్లా అధ్యక్షురాలు పి. లలిత దేవి పాల్గొన్నారు.

అడుగడుగునా అక్రమ లే-ఔట్లు

(మొదటిపేజీ తరువాయి)

పొందాల్చివుంది. కానీ పంచాయితీకి కనీసం తెలియ పర్చకుండా ప్లాట్లుగా విభజించి అమ్మకాలు కూడా కొనసాగిస్తున్నారు. ఇప్పటికే వందల గజాలు స్థలాలు అమ్ముడుపోయి రిజిస్ట్రేషన్లు కూడా పూర్తయినట్టు సమాచారం. ఇటీవల కాలంలో దుళ్ల గ్రామ కంఠం భూమి సర్వే నెంబర్ 144లో నిర్మించిన వెల్ నెస్ సెంటర్‌ను ఆనుకుని ఈ అక్రమ లేఔట్‌ను వేశారు. అయినా అధికారులు చూసీ చూడనట్లు, స్థానిక ప్రజాప్రతినిధులు పట్టీపట్టనట్లు వ్యవహరించడంపై పలు అనుమానాలు తలెత్తుతున్నాయి. అలాగే రియల్టర్లు నుంచిముడుపులు తీసుకున్నారని పలువురు ఆరోపిస్తున్నారు. నిత్యం ఏదొక అంశంపై గళం వినిపిస్తూ స్వపక్షం, విపక్షాల నుంచి విమర్శలు ఎదుర్కొనే దుళ్ల గ్రామ సర్పంచ్ కొండపల్లి పట్టియ్య కూడా మౌనం వహించడం పట్ల పలువురు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. మరికొందరైతే పంచాయతీకి ముడుపులు ముట్టాయని ఆరోపిస్తున్నారు. ఏది ఏమైనా ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి అక్రమ లేఔట్‌లపై చర్యలు చేపట్టాలని, పుట్టగొడుగుల్లా వెలుస్తున్న లేఔట్ ల నియంత్రణపై దృష్టి పెట్టాలని ప్రజలు కోరుతున్నారు. అలాగే సొంత జేబులు నింపుకోవడం మాని, పంచాయితీకి ఆదాయం సమకూరేలా వ్యవహరించాలని పలువురు కోరుతున్నారు.

బిజెపి హయాంలో రాజ్యాంగ వ్యవస్థలు నిర్వీర్యం

(మొదటిపేజీ తరువాయి)

కాంగ్రెస్ గ్యారెంటీల హామీ పత్రాలను విడుదల చేశారు. నియోజకవర్గ ఎంఎల్ఎ అభ్యర్థి సిహెచ్.మార్టిన్ లూథర్‌తో కలిసి ఇంటింటా ప్రచారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పిసిసి కార్యదర్శ జేష్ట సతీష్‌బాబు, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు వెలగా రామకృష్ణ, కొవ్వూరు నియోజవర్గ అభ్యర్థి అరిగెల అరుణకుమారి, చాపర్ల వెంకటేశ్వరరావు, సిపిఎం నాయకులు ఉండవల్లి కృష్ణారావు, భగత్, తదితరులు పాల్గొన్నారు.

రూ.4.08 కోట్ల విలువైన బంగారం, వెండి సీజ్

(మొదటిపేజీ తరువాయి)

లేకుండా బంగారం, వెండి తరలిస్తున్నారని గుర్తించి వాహనాన్ని పిఠాపురం తహశీల్దార్ కార్యాలయానికి తరలించారు. కాకినాడకు చెందిన ప్రముఖ జ్యూయలరి షాపులకు బంగారం ఆభరణాలు తీసుకువెళ్ళుతున్నట్టు లాజిస్టిక్స్ సిబ్బంది తెలిపారు. వాటిని జిఎస్‌టి ఎన్నికల అధికారులు పరిశీలించారు. సరైన పత్రాలు లేకుండా రవాణా చేస్తుండటంతో ఆ బంగారం, వెండిని సీజ్ చేసినట్లు ఎఆర్ఒ, తహశీల్దార్ కె.లక్ష్మి తెలిపారు. ఈ తనిఖీల్లో ఫ్లయింగ్ స్కాడ్ అధికారులు ఎన్ వెంకటేశ్వరరావు, ఆర్‌వి.ప్రసాద్, సిఐ జి.శ్రీనివాసు, ఎస్‌ఐలు బాలాజీ, మురళీమోహన్, ట్రైనీ డిఎస్‌పి ప్రమోద్, సిబ్బంది పాల్గొన్నారు.

కడియం మండలం పొట్టిలంక 216వ నెంబర్ జాతీయ రహదారిపై సార్వత్రిక ఎన్నికల సందర్భంగా ఏర్పాటు చేసిన చెక్‌పోస్టు వద్ద బొలేరో వాహనంలో తరలిస్తున్న రూ.1.04 కోట్ల విలువైన బంగారు, వెండి వస్తువులను స్వాధీనం చేసుకున్నామని రాజమహేంద్రవరం సౌత్ జోన్ డిఎస్‌పి ఎం.అంబికాప్రసాద్ తెలిపారు. కడియం సిఐ బి.తులసీధర్ ఆధ్వర్యంలో శుక్రవారం అర్ధరాత్రి వాహనాలను తనిఖీ చేస్తుండగా వీటిని గుర్తించారన్నారు. జిఎస్‌టి, ఇన్‌కమ్ ట్యాక్స్ అధికారులు ఘటనా స్థలానికి చేరుకొని తహశీల్దార్ బి.రమాదేవి సమక్షంలో పత్రాలను పరిశీలించారన్నారు. తదుపరి విచారణ నిమిత్తం జిల్లా గ్రీవెన్స్ కమిటీకి తరలించామన్నారు.


కూలర్స్ పంపిణీలో కలెక్టర్, ఎస్‌పి

సాయుధ బలగాలకు 38 కూలర్ల ఏర్పాటు

ప్రజాశక్తి -రాజమహేంద్రవరం రూరల్

సార్వత్రిక ఎన్నికల ప్రక్రియలో భాగంగా జిల్లాకు వచ్చిన కేంద్ర సాయుధ బలగాలకు అన్ని రకాల మౌలిక వసతుల ఏర్పాటుకు కృషి చేస్తున్నట్లు, అందులో భాగంగానే కూలర్లను సమకూర్చామని కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి డాక్టర్ కె.మాధవీలత, ఎస్‌పి జగదీష్ తెలిపారు. శనివారం ఎస్‌పి కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో కేంద్ర సాయుధ బలగాల అధికారులకు వారు ఈ కూలర్లను అందించారు. ఈ సందర్భంగా జిల్లా ఎన్నికల అధికారి మాధవీలత మాట్లాడుతూ కేంద్ర సాయుధ బలగాలకు ఎటువంటి లోటు పాట్లు లేకుండా అన్ని విధాల తగిన చర్యలు తీసుకుంటున్నామన్నారు. ఎస్‌పి పి.జగదీష్ సూచనలు మేరకు కూలర్లు సమకూర్చామన్నారు. వాతావరణ కేంద్రం హెచ్చరికల నేపథ్యంలో తగిన జాగ్రత్తలు తీసుకోవాలని, ఎన్నికలను ప్రశాంత వాతావరణంలో జరిపేందుకు సహకరించాలని కోరారు. క్షేత్ర స్థాయిలో విధులు నిర్వహించే స్ట్రాంగ్ రూమ్‌లు, వారు బస చేసే ప్రదేశాల్లో కూలర్లను ఏర్పాటు చేస్తామన్నారు. ఎస్‌పి జగదీష్ మాట్లాడుతూ పెరుగుతున్న ఉష్ణోగ్రతలను దృష్టిలో పెట్టుకుని వారు బస చేసేందుకు ఏర్పాటు చేసిన బేరక్‌లలో ఎయిర్ కూలర్లు ఏర్పాటు చేసుకునేందుకు కూలర్లను ఏర్పాటు చేయాలని కోరామన్నారు. ఈ మేరకు కలెక్టర్ వెంటనే స్పందించి వీటిని సమకూర్చారన్నారు. కేంద్ర బలగాల ఇన్‌ఛార్జ్‌లతో మాట్లాడుతూ సమస్యలను తమ దృష్టికి తీసుకొస్తే పరిష్కరిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ ఎస్‌పి(లా అండ్ ఆర్డర్) పి.అనిల్‌కుమార్, అడిషనల్ ఎస్‌పి (ఎ ఆర్) ఎల్.చెంచి రెడ్డి , సాయుధ బలగాల ప్రతినిధులు, పోలీసు అధికారులు పాల్గొన్నారు.

మార్కొండపాడులో 'ముప్పిడి' ఇంటింటా ప్రచారం

ప్రజాశక్తి - చాగల్లు

కూటమి బలపర్చిన కొవ్వూరు అసెంబ్లీ నియోజకవర్గ టిడిపి అభ్యర్థి ముప్పిడి వెంకటేశ్వరరావు భార్య ముప్పిడి సుజాత శనివారం మార్కొండపాడులో ఇంటింటా ప్రచారం నిర్వహించారు. వెంకటేశ్వరరావుకు ఓటు వేసి గెలిపించాలని ప్రజలను కోరారు. ఈ కార్యక్రమంలో టిడిపి, జనసేన, బిజెపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

భూమి రక్షణ అందరి బాధ్యత

ప్రజాశక్తి - నల్లజర్ల

భూమాత రక్షణ ప్రజలందరి బాధ్యత అని ప్రముఖ సినీ నటులు మొల్లేటి బాలాజీ అన్నారు. నల్లజర్ల మండలం దూబ చర్లలో స్థానిక శ్రీ సంఘమిత్ర విద్యాలయ విదార్థులు వినూత్నమైన కార్యక్రమానికి నాంది పలికారు. ఈ కార్యక్రమానికి ప్రముఖ సినీ నటులు మొల్లేటి బాలాజీ ముఖ్య అతిథిగా విచ్చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణే ధ్యేయంగా భూమి రక్షణకు అందరూ కృషి చేయాల్సిన సమయం ఆసన్నమైందన్నారు. స్కూల్ డైరెక్టర్ అంబటి శ్రీనివాసరావు సంఘమిత్ర విద్యార్థులందరూ మొక్కలు నాట పరిరక్షించాలన్నారు. 125 మంది విద్యార్థులతో జయహో ధరణి జయహో అంటూ చేసిన నృత్య ప్రదర్శన లిమ్కా బుక్ ఆఫ్ రికార్డ్స్, జీనియస్ బుక్ ఆఫ్ రికార్డ్స్‌కు ఎన్నికయ్యారన్నారు. ఈ కార్యక్రమంలో అకాడమిక్ డైరెక్టర్ నెక్కంటి వెంకటేష్, వరల్డ్ రికార్డ్ కో-ఆర్డినేటర్ నాగేంద్రప్రసాద్, జానపద కళారత్న ఎల్‌ఆర్.కృష్ణబాబు, లయన్స్ క్లబ్ సభ్యులు జామి రాంబాబు, కెల్లా గణేష్, హెచ్‌ఎం గిరికుమార్ పాల్గొన్నారు.

హౌస్ ఓటింగ్‌కు దరఖాస్తు చేసుకోవాలి

ప్రజాశక్తి-అమలాపురం

ఎన్నికలకు సంబంధించిన గెజిట్ నోటిఫికేషన్ విడుదలైన తదుపరి ఇంటి వద్ద నుంచే వృద్ధులు, వికలాంగులు ఓటింగ్‌కు దరఖాస్తు చేసుకొనవచ్చని జిల్లా ఎన్నికల ప్రధాన అధికారి, జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్లా శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. 12 డి ఫారం పూర్తి చేసి సంబంధిత రిటర్నింగ్ అధికారికి సమర్పించాలన్నారు. ఈ ఫామ్ సేకరించే బాధ్యత బూత్ స్థాయి ఆఫీసర్‌కు అప్పగించామన్నారు. 85 ఏళ్ల వయస్సు పైబడిన, 40 శాతం వైకల్యం ఉన్న వారు అర్హులుగా నిర్ధారించారన్నారు. ఫారం 12 డితో పాటుగా వికలాంగ ఓటర్లు వికలాంగ ధ్రువీకరణ పత్రం కూడా సమర్పించాలన్నారు. 85 ఏళ్ళ పైబడిన వృద్ధులు, వికలాంగ ఓటర్లు పోలింగ్ కేంద్రం వరకు రాలేని స్థితిలో ఉన్న వృద్ధులు, వికలాంగులకు ఈ ఎన్ని కల్లో ఈ సౌకర్యం కల్పిస్తూ కేంద్ర ఎన్నికల సంఘం నిర్ణయం తీసుకుందన్నారు. ఇంటి వద్దే ఓటు వేసే ప్రక్రియ మొత్తం వీడియో చిత్రీకరణ చేస్తారన్నారు. ఓటు ఎవరికి వేశారో తెలియకుండా గోప్యత, రహస్య ఓటింగ్ విధానాన్ని అమలు చేస్తారన్నారు. ఈ సదుపాయాన్ని పొందే విధానాన్ని సరళంగా, సమగ్రంగా పారదర్శకంగా కేంద్ర ఎన్నికల సంఘం రూపొందించిందన్నారు. అర్హులైన ఓటర్లు ఇంటి వద్ద చేసేందుకు 12 డి ఫారమ్ ను పూర్తి చేసి రిటర్నింగ్ అధికారికి ఇవ్వాలన్నారు. వికలాంగులు 12.డి ఫారం తోపాటు వైద్య ధ్రువీకరణ పత్రాన్ని విధిగా సమర్పించాలన్నారు. వీరి నుంచి నింపిన 12 డి ఫారాన్ని బూత్ స్థాయి అధికారి సేకరిస్తారన్నారు. జవాబు దారితనం, పారదర్శకత కోసం ఇంటి వద్ద ఓటు వేసే వారి వివరాలను పోటీలో ఉన్న అభ్యర్థులకు అందుబాటులో ఉంచుతారన్నారు. అవసరమైతే అభ్యర్థులు ఈ ప్రక్రియను పర్యవేక్షించుకోవచ్చన్నారు ఈ ఓటర్ల ఇళ్ల వద్ద భద్రత అధికారులతో పాటు ప్రత్యేక పోలింగ్ బృందం వెళుతుందన్నారు. ఎప్పుడు ఇంటికి వచ్చేది ముందుగానే ఆయా ఓటర్లకు సమాచారాన్ని తెలియజేస్తారన్నారు. ఇంటి వద్ద ఓటు వేసే పూర్తి ప్రక్రియ వీడియో తీస్తారని, ఓటు ఎవరికి వేసింది తెలియకుండా గోప్యతను పాటిస్తారన్నారు. ఇంటి వద్ద ఓటు వేసిన తరువాత ఆ బ్యాలెట్లను భద్రంగా బ్యాక్సుల్లో ఉంచి తిరిగి రిటర్నింగ్ అధికారికి స్వాధీనం చేస్తారన్నారు ఈ బ్యాలెట్ ఓట్లను సాధారణ ఓట్ల లెక్కింపు సమయంలో లెక్కిస్తారన్నారు.

నేటి నుంచి గ్రామసభలు నిర్వహించాలి

ప్రజాశక్తి-అమలాపురం

సాధారణ ఎన్నికల దృష్ట్యా ఎన్నికల ప్రవర్తనా నియమావళి అమల్లో ఉన్నా ఈ నెల 14వ తేదీ ఆదివారం నుంచి వారం లోగా గ్రామ సభ తప్పని సరిగా అందరూ పంచాయతీ కార్యదర్శులు అన్ని గ్రామాల్లో నిర్వహించాలని జిల్లా పంచాయతీ అధికారి డి.రాంబాబు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన శనివారం ఒక ప్రకటన విడుదల చేశారు. జనవరి 26, ఏప్రిల్ 14, జులై 1, అక్టోబర్ 3 ప్రతి సంవత్సరం నాలుగు సార్లు చట్టబద్ధమైన గ్రామసభలు జరపాలనే నిబంధనలు ఉన్నందున ఏప్రిల్ 14న ఎన్నికల కోడ్ అమలులో ఉన్నా తప్పనిసరిగా గ్రామసభలు జరపాలా అనే అంశం ప్రాధాన్యతను సంతరించుకుంది. అయితే ఎన్నికల ప్రవర్తనా నియమావళి అమలులో ఉన్నందున ఎలక్షన్ మోడల్ కోడ్ ఆఫ్ కాండక్టుకు లోబడి గ్రామ సభలు నిర్వహించాలి. ఓటర్లను ప్రభావం చేసే అంశాలు గ్రామసభలో చర్చించకూడదు, అలాగే గ్రామసభ వేదికను ఓటర్లకు అవగాహనా కార్యక్రమముగా ఉపయోగించుకొని ఓటింగ్ శాతం పెరగడానికి, నీతి వంతమైన ఓటింగ్ జరగడానికి పంచాయతీ కార్యదర్శి చర్య తీసుకోవాలి.

గ్రామ సభ నిర్వహణకు సూచనలు

1.అధ్యక్షులుగా సర్పంచ్ ఉంటారు. కానీ వారు ఏ విధమైన రాజకీయ అంశాలకు సంబంధించి స్పీచ్ ఇవ్వరాదు. 2. ఏవిధమైన కొత్త తీర్మానాలు చేయరాదు. 3. ఏ విధమైన పార్టీకి సంబంధించిన చిహ్నాలు, జెండాలు ధరించి రాకూడదు. 4. కేవలం అధికారులు, ప్రజలు పాల్గొనాలి. 5. కొత్త పథకాలు,పనుల గురించి మాట్లాడరాదు. 6. రోజువారీ పరిపాలనకు సంబంధించినవి మాత్రమే వివరించాలి. 7. సమావేశం నకు హాజరు అగు ప్రజలు ఎన్నికల నియమావళికి కట్టుబడి ఉండాలి.

గ్రూపుల పోరుకు చెక్

ప్రజాశక్తి-నల్లజర్ల

గోపాలపురం నియోజకవర్గం టిడిపి అసెంబ్లీ అభ్యర్థి టిక్కెట్ విషయంలో ఇప్పటివరకు రెండు గ్రూపుల మధ్య జరుగుతున్న తీవ్రమైన పోరుకు శనివారం తెరపడింది. సువ్వా నేనా అన్నట్లుగా సుమారు ఏడాదిన్నర కాలంగా గోపాలపురం టిడిపి ఇన్‌ఛార్జిగా మద్దిపాటి వెంకట రాజు కొనసాగుతూ ఉండగా వ్యతిరేకవర్గమైన ముళ్ళపూడి బాపిరాజు మద్దిపాటి వద్దు ఎవరైనా ముద్దు అనే నినాదంతో తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తూ పలు నిరసనలు ధర్నాలు చేస్తూ వచ్చారు. టిడిపి జాతీయ అధ్యక్షుడు నారా చంద్రబాబు నాయుడు బాపిరాజుతో ఆరుసార్లు ఈ విషయంపై చర్చలు జరిపినప్పటికీ సఫలం కాలేదు ఎన్నికల సమయం దగ్గర పడుతున్న కొద్దీ కార్యకర్తలు నాయకుల్లో ఉత్కంఠ నెలకొంది. ఇటీవల నల్లజర్లలో జరిగిన ప్రజా గళం సభ అనంతరం కూడా బాపిరాజు వర్గం నిరసన తెలిపింది. శుక్రవారం అధినేత చంద్రబాబుతో ఏలూరు జిల్లా టిడిపి అధ్యక్షులు మాజీ ఎంఎల్ఎ గన్ని వీరాంజనేయులు ఆధ్వర్యంలో జరిగిన చర్చల్లో అలక వీడిన ముళ్లపూడి శనివారం నల్లజర్లలో ప్రియాంక కళ్యాణ మండపంలో ఏర్పాటు చేసిన నియోజకవర్గ స్థాయి కార్యకర్తల సమావేశంలో ఆయన తన మద్దతును తెలిపారు. కార్యక్రమంలో నాలుగు మండలాల పార్టీ అధ్యక్షులు నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

కాజ్‌వే తొలగింపుతో అవస్థ

ప్రజాశక్తి-మామిడికుదురు

పాశర్లపూడిలంక -లూటుకుర్రు మధ్య వాడ్రేవుపల్లి మీడియం డ్రెయిన్‌పై శిథిల స్థితికి కాజవే ను డైవర్షన్ రోడ్డు వేయకుండా తొలగించారు. కొత్త వంతెన నిర్మాణానికి రూ.1.01కోట్లు మంజూరు కావడం తో పనులు చేపట్టేందుకు పంచాయితీ రాజ్ ఇంజినీరింగ్ అధికారులు కార్యాచరణ ప్రారంభించారు. రెండు వైపులా మురుగు నీరు మళ్లించేందుకు క్రాస్ బండ్ లు ఏర్పాటు చేశారు. డై వర్షన్ రోడ్డు ఏర్పాటు చేయకపోవడం తో ఆదుర్రు, లూటుకుర్రు వాసులు రాకపోకలకు 5కి.మీ అదనపు దూరం చుట్టూ తిరిగి అవస్థ పడుతున్నారు. రాక పోకలు సాగించేలా డై వర్షన్ రోడ్డు ఏర్పాటు చేయాలంటున్నారు.



డ్రెయిన్‌పై తొలగించిన శిథిల కాజ్ వే

నేడు జిల్లా 'అరసం' మహాసభ

ప్రజాశక్తి-అమలాపురం రూరల్

ఎపి అభ్యుదయ రచయితల సంఘం (అరసం) జిల్లా ప్రథమ మహాసభ ఆదివారం బండారులంకలో వివిఎం షాపింగ్ మాల్‌పై అంతస్తులోని ఆడిటోరియంలో నిర్వహిస్తారని జిల్లా కన్వీనర్, రచయిత గండి స్వామి ప్రసాద్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ముఖ్య అతిథులుగా అరసం జాతీయ అధ్యక్షులు పెనుగొండ లక్ష్మీనారాయణ, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వల్లూరు శివప్రసాద్, తూర్పుగోదావరి జిల్లా అధ్యక్షులు పడాల వీరభద్రరావు, రాష్ట్ర కార్యదర్శి బొల్లినేని నాగార్జున సాగర్, అల్లూరి సీతారామరాజు యువజన సంఘం జాతీయ ఉపాధ్యక్షులు పూటుకూరి సుబ్రహ్మణ్యేశ్వరస్వామి, జన విజ్ఞాన వేదిక రాష్ట్ర మాజీ అధ్యక్షులు డాక్టర్ చల్లా రవి కుమార్ హాజరవుతారన్నారు. సాహితీ ప్రియులు, భాషాభిమానులు, కవు లు, రచయితలు పాల్గొని మహాసభ ను జయప్రదం చేయాలన్నారు.

వెంకన్న దర్శనానికి యాత్రికుల అవస్థలు

- ప్రముఖులకు ఉత్తర ద్వార దర్శనం
- సామాన్యులకు క్యూ లైన్‌లోనే..
- మండిపడుతున్న యాత్రికులు



ఆలయ ప్రాంగణంలో కూర్చున్న యాత్రికులు

ప్రజాశక్తి-ఆత్రేయపురం

వాడపల్లి వెంకటేశ్వర స్వామి ఆలయానికి రోజురోజుకు యాత్రికులు తాకిడి ఎక్కువ అవడంతో ఆలయ అధికారులు సామాన్య యాత్రికులకు సౌకర్యాలు కల్పించకపోగా ప్రముఖులకు, డోనర్స్ కు, సకల మర్యాదలతో ఉత్తర ద్వారం ద్వారా దర్శనాలు చేయించడంపై ఆలయ పర్యవేక్షకుడు శ్రీనివాస్ పై సామాన్య యాత్రికులు మండిపడుతున్నారు. గంటల తరబడి దర్శనం కోసం క్యూ లైన్ లో వేసవి దృష్ట్యా అవస్థలు పడుతూ ఆయ ప్రయాసలతో స్వామివారిని దర్శించుకుందామంటే కనీసం ఐదు గంటలు సమయం పైనే పడుతుందని యాత్రికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఆలయానికి వచ్చే రాజకీయ నాయకులకు ఆలయ అభివృద్ధికి రూ.లక్షల్లో విరాళాలు ఇచ్చి దాతలకు మాత్రమే ఆలయ సిబ్బంది మరియు అధికారులు సకల మర్యాదలతో దగ్గరుండి స్వామి వార దర్శనం చేయించి అన్ని సౌకర్యాలు కల్పిస్తున్నారు. వీరికి ఏడు ప్రదక్షణలను ఆలయ ప్రాంగణంలోని దగ్గరుండి చేయిస్తారు. మిగతా యాత్రికులకు అయితే ఆలయ బయట మాడ వీధులలో ప్రదక్షణలు చేస్తుంటే వారికి ఆలయ ప్రాంగణంలో ప్రదక్షణలు ఏమిటంటే మండిపడుతున్నారు. శనివారం మధ్యాహ్నం ఎపి గృహ నిర్మాణ శాఖ చైర్మన్ మేడపాటి షర్మిలారెడ్డి ఆలయ ప్రాంగణంలో ఏడు ప్రదక్షణలు, ఉత్తరం ద్వారా స్వామి వారిని దర్శించుకున్నారు. వీరికి ముందుగానే ఆలయ సూపరింటెండెంట్ అన్ని ఏర్పాట్లు చేస్తారు. అలాగే మాజీ మంత్రి గంటా శ్రీనివాసరావు భార్య స్వామివారిని ఉత్తరం ద్వారా దర్శించుకున్నారు. వీరికి ఆలయ పిఆర్ఓ వేణు దగ్గరుండి స్వామివారి దర్శనం సకల మర్యాదలతో చేయించడంపై యాత్రికులు మండిపడుతున్నారు. స్వామి వారిని దర్శించుకునేందుకు ఆంధ్ర రాష్ట్రాలు ఉండే కాకుండా ఒడిశా, మహారాష్ట్ర, మధ్యప్రదేశ్ రాష్ట్రాల నుండి తరలివస్తున్నారు. కొంతమంది యాత్రికులు విమానాల్లో, రైళ్లలో వచ్చి స్వామివారిని దర్శించుకునేందుకు క్యూలైన్లో 5 నుంచి 6 గంటలు పట్టడంతో తిరిగి ప్రయాణం సమయం సరిపోక ధ్వజస్తంభం వద్ద స్వామివారికి మొక్కుకుని వెను దిరుగుతున్నారు. స్వామివారికి ప్రతి శనివారం రూ.40 లక్షల రూపాయలు ఆదాయం ప్రతినెల రూ.70 లక్షల నుండి రూ.80 లక్షల వరకు హుండీ ఆదాయం ప్రతిరోజు అన్నదానానికి రూ.లక్షల విరాళాలు వస్తున్నాయి. కానీ సామాన్య భక్తులు విశ్రాంతి తీసుకోవాలంటే కూర్చోవడానికి కనీసం స్థలం కూడా లేకపోవడంతో అవస్థలు పడుతున్నారు ఇప్పటికైనా ఉన్నతాధికారులు కలగజేసుకొని ఆలయానికి వచ్చే సామాన్య యాత్రికులకు సౌకర్యాలు కల్పించాలని వివిధ ప్రాంతాల నుంచి వచ్చే యాత్రికులు కోరుకుంటున్నారు



గోగనమఠంలో నాయకులతో దేవ వర ప్రసాద్ సమావేశం

సమస్య ల పరిష్కారానికి ప్రాధాన్యత

ప్రజాశక్తి -మామిడికుదురు

సమస్యలు పరిస్కారానికి ప్రథమ ప్రాధాన్యత కల్పిస్తామని రాజోలు నియోజకవర్గఉమ్మడి అభ్యర్థి దేవ వరప్రసాద్ హామీఇచ్చారు. గోగన్నమఠం లో శనివారం మండల శాఖ అధ్యక్షులు ముల్లెటి శ్రీనివాస్, దొడ్డ జయరామ్ అధ్వర్యంలో సమావేశం లో ఆయన మాట్లాడారు ముఖ్య నాయకులతో, కార్యకర్తలతో మాట్లాడుతూ ప్రజా సమస్యలు గురించి బిసి డిక్లరేషన్ గురించి , మత్యకారుల పడుతున్న ఇబ్బందులు, ప్రజా సమస్యలు తాగు నీరు, డ్రెయిన్ సమస్య, కరెంటు సమస్య తదితర సమస్యలు తెలుసుకున్నారు. ఎంఎల్ఎ అభ్యర్థికి గాజు గ్లాసుపై, ఎంపీ అభ్యర్థి హరీష్ మాథూర్ కి సైకిల్ గుర్తుపై ఓటు వేసి అత్యధిక మెజార్టీ తో గెలిపించాలని కోరారు ముత్యాలపాలెం, కరవాక, మగటపల్లి గ్రామాల్లో ప్రచారం నిర్వహించారు. కార్యక్రమం లో జెడ్ పి మాజీ ఛైర్మన్ నామన రాంబాబు, మద్దాల పెద్ద కాపు, రాజోలు ఎంపిపి కేతాశ్రీనివాస్, అల్లు సురేష్, భూపతి రాజు ఈశ్వర్ రాజు వర్మ జనసేన, టిడిపి బిజెపిల రాష్ట్ర జిల్లా మండల గ్రామ స్థాయి నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.



చోడవరం లో సూర్య ప్రకాష్ సమక్షంలో వైసిపిలో చేరికలు

వైసిపి అభ్యర్థి సూర్యప్రకాష్ ఎన్నికల ప్రచారం

ప్రజాశక్తి-రామచంద్రపురం

రామచంద్రపురం మండలం చోడవరం గ్రామం లో శనివారం ఉదయం వైసిపి అభ్యర్థి పిల్లి సూర్యప్రకాష్ ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు వైసిపిలో చేరారు. వారికి సూర్య ప్రకాష్కండువాలు కప్పి పార్టీలోకి వారిని ఆహ్వానించారు. ఈ సందర్భంగా వచ్చే ఎన్నికల్లో జగనన్న పాలన కోసం మరొకసారి ఫ్యాన్ గుర్తుపై ఓటు వేసి గెలిపించాలన్నారు. నిరుపేదలందరికీ సంక్షేమ పథకాలు మళ్లీ అందించాలని ఆయన కోరారు. కార్యక్రమంలో నాయకులు అడవి కుమార్, గ్రామ సర్పంచ్ నేదూరి జగజ్జీవన్, బిక్కిన సురేష్, నేదురు పద్మనాభం, కాండ్రకోట దుర్గారావు, మందపల్లి దొరబాబు, దొంగ మహాలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.



శివల గ్రామంలో ప్రచారం నిర్వహిస్తున్న సుభాష్

టిడిపి అభ్యర్థి సుభాష్ ఎన్నికల ప్రచారం

ప్రజాశక్తి-రామచంద్రపురం

కె.గంగవరం మండలంలోని శివల గ్రామం లో శనివారం టిడిపి అభ్యర్థి వాసంశెట్టి సుభాష్ ఎన్నికల ప్రచారం నిర్వహిర్చారు. ఈ సందర్భంగా ఇంటింటికి వెళ్లి సూపర్ సిక్స్ పథకాలు వివరించి కరపత్రాలను అందజేశారు. వచ్చే ఎన్నికల్లో టిడిపిని గలిపించాలని ఆయన కోరారు. ఆయన వెంట మార్కెట్ కమిటీ మాజీ ఛైర్మన్ కొమరిన వీర్రాజు, టిడిపి నాయకులు రేవు శ్రీను, రావిపాటి గణేష్ చౌదరి, రైతు సంఘం నాయకులు బలుసు శివ ప్రసాద్, మాజీ జెడ్పిటిసి సభ్యులు మేడిశెట్టి రవి కుమార్ తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ పార్టీ కార్యాలయాలు ప్రారంభం



అమలాపురంలో కాంగ్రెస్ పార్టీ కార్యాలయాన్ని ప్రారంభిస్తున్న నేతలు

ప్రజాశక్తి-యంత్రాంగం

జిల్లాలో రెండు చోట్ల కాంగ్రెస్ పార్టీ కార్యాలయాలను ఆ పార్టీ నాయకులు శనివారం ప్రారంభించారు. పలువురు ముఖ్య నాయకులు ఈ కార్యక్రమాల్లో పాల్గొన్నారు.

అమలాపురం అమలాపురం అసెంబ్లీ కాంగ్రెస్ పార్టీ ఎన్నికల కార్యాలయాన్ని నల్ల వంతెన పద్మినీపేట సెంటర్ వద్ద రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ జంగా గౌతమ్ ప్రారంభించారు. ఏఐసిసి సభ్యులు చీకట్ల అబ్బాయి, పిసిసి ఉపాధ్యక్షులు కొత్తూరి శ్రీనివాస్, ఎఐసిసి కో ఆప్షన్ సభ్యుల యార్లగడ్డ రవీంద్ర, పిసిసి జనరల్ సెక్రెటరీ మాచవరపు శివన్నారాయణ, మహమ్మద్ ఆరిఫ్, జిల్లా మీడియా చైర్మన్ దామిశెట్టి జయ, పట్టణ అధ్యక్షులు వంటెద్దు బాబి, పోలిశెట్టి హరిబాబు, రాయుడు వెంకటరమణ, పిసిసి సభ్యురాలు ధోని పాటి విజయలక్ష్మి జిల్లా ప్రధాన కార్యదర్శి నిమ్మకాయల ప్రసాద్ జోగి అర్జునరావు అల్లపల్లి ముత్యాలరావు ఓబిసి రాష్ట్ర కోఆర్డినేటర్ రెడ్డి బాబు పేరి శర్మ ముల్లేటి వెంకటేశ్వరరావు జిల్లా మహిళా అధ్యక్షురాలు మెహబూబా షకీలా రాయుడు గంగ భవాని పులుసు గంటి ప్రకాష్, రొక్కాల సత్యనారాయణ అయితా బత్తుల కుమార్ సింగ్ తదితరులు పాల్గొన్నారు. **ముమ్మిడివరం** దేశంలో ప్రజాస్వామ్యం మనుగడ సాధించాలన్నా, రాష్ట్రానికి ప్రత్యేక హోదా అమలు చేయాలన్నా కాంగ్రెస్ పార్టీని గెలిపించాలని కాంగ్రెస్ పార్టీ నాయకులు పిలుపునిచ్చారు. ముమ్మిడివరం నగర పంచాయతీ పరిధిలో అసెంబ్లీ నియోజకవర్గ అభ్యర్థి పాలెపు ధర్మారావు ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కాంగ్రెస్ పార్టీ నూతన కార్యాలయాన్ని శనివారం పార్టీ జిల్లా అధ్యక్షుడు కామన ప్రభాకర్ రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మతం పేరుతో, కులం పేరుతో లబ్ధి పొందాలని చూస్తున్న పార్టీలకు ఓటుతో బుద్ధి చెప్పాలన్నారు. భారత రాజ్యాంగాన్ని మారుస్తామని ప్రకటిస్తున్న మనువాద పార్టీలను చిత్తుగా ఓడించి ప్రజాస్వామ్య మనుగడను కాపాడే కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులను గెలిపించాలని కోరారు. మరో అతిథి ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ జంగా గౌతమ్ మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తే మొదటి ఏడాది కేంద్రంలోని 30 లక్షలు, రాష్ట్రంలోని 2.25 లక్షల ఉద్యోగాలను భర్తీ చేస్తామని, ఉపాధి హామీ కూలీని రోజుకు రూ.400 చేస్తామని, వృద్ధులకు, వితంతువులకు



ముమ్మిడివరంలో కాంగ్రెస్ పార్టీ కార్యాలయం ప్రారంభ కార్యక్రమంలో పాల్గొన్న నాయకులు

పెన్షన్ రూ.4 వేలు, వికలాంగులకు రూ.6 వేలు అందిస్తామని, కెజీ నుంచి పీజీ వరకు ఉచిత విద్యను అందిస్తామని, గృహ రుణాలు రూ.5 లక్షలు అందిస్తామని, రైతు పెట్టుబడి మీద 50 శాతం లాభంతో మద్దతుదారులు కల్పిస్తామని, రాష్ట్రానికి ప్రత్యేక హోదా 10 సంవత్సరాలు గ్యారెంటీ గా అమలు చేస్తామని హామీనిచ్చారు. అధికార ఉమ్మడి కుటుంబలు రాష్ట్రాన్ని భ్రష్టు పట్టించాయన్నారు. రాష్ట్రాన్ని అభివృద్ది వైపు నడిపించేది కాంగ్రెస్ మాత్రమేనని,గెలుపు తథ్యం అన్నారు. అనంతరం ఇంటింటా ప్రచారం చేసి కాంగ్రెస్ పర్టి మ్యానిఫెస్టో కరపత్రాలు అందించారు. ఈ కార్యక్రమంలో పిసిసి జనరల్ సెక్రెటరీ అరీఫ్, శివనారాయణ, గోడి భాస్కర రావు, పోతరాజు మండల పార్టీ అధ్యక్షుడు దివి వెంకన్న బాబు(ముమ్మిడివరం), అయితాబత్తుల పండు బాబు (కాట్రేనికోన)లతో పాటు వామ పక్ష పార్టీల నాయకులు తదితరులు పాల్గొన్నారు.

సమస్యాత్మక గ్రామాల్లో కేంద్ర బలగాల కవాతు

ప్రజాశక్తి -అమలాపురం

2024-సార్వత్రిక ఎన్నికల దష్ట్యా శనివారం కొత్తపేట డివిజన్ లో అంబాజీపేట పోలీసు స్టేషన్ పరిధిలో వక్కలంక, ముక్కామల, పుల్లేటికుర్రు ఇరుసుమండ గ్రామాల్లో సమస్యాత్మక పోలింగ్ స్టేషన్ లు, సమస్యాత్మక గ్రామాలలో స్థానిక పోలీసులు కేంద్ర బలగాలు సంయుక్తంగా ఫ్లాగ్ మార్చ్ నిర్వహించి ఎన్నికల విషయమై ప్రతి ఒక్కరూ తమ ఓటు హక్కును స్వేచ్ఛగా, నిర్భయంగా వినియోగించుకునేందుకు ప్రజలకు భరోసా కల్పించినారు అవగాహన కార్యక్రమం నిర్వహించినారు. రామచంద్రాపురం డివిజన్ లో రామచంద్రాపురం టౌన్ పోలీసు స్టేషన్ పరిధిలో మాలపాడు నుంచి కొత్తూరు గ్రామం వరకు సమస్యాత్మక పోలింగ్ స్టేషన్ లు, సమస్యాత్మక గ్రామాలలో స్థానిక పోలీసులు కేంద్ర బలగాలు సంయుక్తంగా ఫ్లాగ్ మార్చ్ నిర్వహించి ఓటు హక్కుపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు.



ఫ్లాగ్ మార్చ్ నిర్వహిస్తున్న పోలీసులు, కేంద్ర బలగాలు



ఎన్నికల అధికారులు శిక్షణలో మాట్లాడుతున్న ఆర్డిఒ సుధా సాగర్

పోలింగ్ విధులపై అధికారులకు శిక్షణ

ప్రజాశక్తి-రామచంద్రపురం

రామచంద్రపురం అసెంబ్లీ నియోజకవర్గంలో సాధారణ ఎన్నికలు సందర్భంగా పట్టణంలోని రత్నంపేట మున్సిపల్ హైస్కూల్లో రామచంద్రపురం, కె.గంగవరం మండల పరిధిలో ఉన్న పోలింగ్ అధికారులకు, అసిస్టెంట్ పోలింగ్ అధికారులకు, సిబ్బందికి ఎన్నికలపై శిక్షణ తరగతులు నిర్వహించారు. శిక్షణ తరగతుల్లో పోలింగ్ కేంద్రంలో నిర్వహించాల్సిన విధులు తెలియజేశారు. శాంతియుతంగా ఎన్నికలు నిర్వహించేందుకు అనుసరించాల్సిన విధానాలు రెవెన్యూ డివిజనల్ అధికారి ఎస్.సుధా సాగర్ తెలిపారు. రామచంద్రపురం తహశీల్దార్ ఎం వెంకటేశ్వరరావు, మున్సిపల్ కమిషనర్ శ్రీనివాసులు, కె.గంగవరం, కాజులూరు తహశీల్దార్లు కార్యాలయ సిబ్బంది, గ్రామ రెవెన్యూ అధికారులు పాల్గొన్నారు.

టిడిపి ఆధ్వర్యంలో ‘జయహో బిసి’

ప్రజాశక్తి-అమలాపురం(అల్లవరం)



కార్యక్రమంలో మాట్లాడుతున్న ఆనందరావు

అల్లవరం మండలంలో మండల పార్టీ అధ్యక్షులు దెందుకూరి సత్తిబాబు రాజు అధ్యక్షతన అమలాపురం అసెంబ్లీ టిడిపి, జనసేన, బిజెపి కూటమి అభ్యర్థి అయితాబత్తుల ఆనందరావు ఆధ్వర్యంలో జయహో బిసి సదస్సు శనివారం నిర్వహించారు.ఈ కార్యక్రమం లో ఆనందరావు మాట్లాడుతూ చంద్ర బాబు అధికారంలోకి వస్తే బిసిలకు 50 సంవత్సరాలకే పెన్షన్ నెలకు రూ.నాలుగు వేలకు పెంచుతారన్నారు. బిసిలకు ప్రత్యేక రక్షణ చట్టం తీసుకొస్తారని బీసీ సబ్ ప్లాన్ ద్వారా ఐదేళ్లలో రూ.లక్షన్నర కోట్లు ఖర్చు చేస్తారని, స్థానిక సంస్థల్లో బీసీలకు 34శాతం రిజర్వేషన్లు పునరుద్ధరిస్తారని, ఆర్థికాభివృద్ధి, ఉపాధికి ప్రోత్సాహకాలు, చట్టబద్ధంగా కుల గణన చంద్రన్న బీమా రూ.10 లక్షలతో పునరుద్ధరణ, పెళ్లి కానుకలు రూ.లక్ష, శాశ్వత కుల ధ్రువీకరణ పత్రాలు అందజేస్తామని, విద్యా పథకాలు అన్నీ పునరుద్ధరించి నిర్మాణాలను ఏడాదిలో పూర్తి చేస్తారని అన్నారు. కార్యక్రమంలో పెచ్చెట్టి విజయలక్ష్మి, నడిపల్లి సుబ్రహ్మణ్యం రాజు, వెగిరాజు వెంకటరాజు, కడలి వెంకటేశ్వరరావు, చింతా శ్రీనివాసరావు, కాకిలేటి సూర్య ప్రకాశం, మామిడిశెట్టి శ్రీరామ్, గెద్దాడ శ్రీనివాస్, కంకిపాటి వీరబాబు, టిడిపి, జనసేన, బిజెపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

కాంగ్రెస్‌లో పార్టీలో చిట్టిబాబు చేరిక

ప్రజాశక్తి -మామిడికుదురు

పి. గన్నవరం వైసిపి ఎంఎల్ఎ కొండేటి చిట్టి బాబు ఆ పార్టీకి రాజీనామా చేసి పిసిసి అధ్యక్షురాలు వైఎస్.షర్మిల సమక్షంలో శనివారం ముగ్గనూరు లో కాంగ్రెస్ పార్టీ లో చేరారు. చిట్టిబాబు కాంగ్రెస్ పార్టీ లో చేరడం తో ఆ పార్టీ కార్యకర్తలు ఆనందోత్సవాల్లో ఉన్నారు.



వై ఎస్ షర్మిల సమక్షంలో కాంగ్రెస్‌లో చేరిన కొండేటి చిట్టిబాబు

జి.మూలపాలెం టిడిపి కార్యాలయం ప్రారంభం

ప్రజాశక్తి -ఐ.పోలవరం

ముమ్మిడివరం నియోజకవర్గ టిడిపి, జనసేన, బిజెపిల ఉమ్మడి ఎంఎల్ఎ అభ్యర్థి దాట్ల సుబ్బరాజు శనివారం జి.మూలపాలెంలో టిడిపి కార్యాలయాన్ని శనివారం ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ వైసిపి అరాచక పాలనలో అభివృద్ధి అనేదే లేకుండా పోయిందన్నారు. అరాచక పాలన అంతమొందించి చంద్రబాబు నేతృత్వంలోని కూటమి ప్రభుత్వ సుపరిపాలన కావాలంటే అంతా సైకిల్ గుర్తుకు ఓటువేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమం లో కాకర్లపూడి రాజేష్, లంకలపల్లి బుల్లియ్య, దండుప్రోలు సాయి, సంగాని మీరబాబు, లంకె శ్రీనివాస్, దాట్ల పద్మి రాజు తదితరులు పాల్గొన్నారు.



ప్రారంభిస్తున్న దాట్ల సుబ్బరాజు

పల్లెల్లో బెట్టింగ్ జోరు..!

అప్పుల పాలవుతున్న యువత
సెల్‌ఫోన్, ఆన్‌లైన్‌లో లావాదేవీలు



ప్రజాశక్తి - యు.కొత్తపల్లి

గత కొన్ని రోజులుగా ఐపిఎల్ క్రికెట్ మ్యాచులు జరుగుతున్నాయి. క్రికెట్‌ను ఆస్వాదించే వాళ్ళు కొందరైతే..క్రికెట్ మ్యాచ్‌లపై బెట్టింగులు వేసి డబ్బులు సంపాదించేవారు కొందరైతే...ఆ మ్యాచ్‌ల తీరుపై అవగాహన లేకుండా బెట్టింగులు వేస్తూ ఆస్తులు పోగొట్టుకుంటున్న వారు ఉన్నారు. గతంలో ఈ బెట్టింగుల వ్యవహారం పట్టణాలు, నగరాలకే పరిమితం అయ్యేది. అయితే ప్రస్తుతం ఈ బెట్టింగుల ప్రభావం పల్లెలకు పాకింది. బెట్టింగ్ వ్యవహారంపై ఎటువంటి అవగాహన లేకుండా పల్లెల్లో యువత చేతులు కాల్చుకుంటున్నారు. ఇందుకోసం అప్పులు చేసేందుకు కూడా వెనకాడడం లేదు. పెద్దఎత్తున సాగుతున్న ఈ బెట్టింగ్ అమాయకుల బతుకులను నాశనం చేస్తోంది. ప్రస్తుతం జరుగుతున్న ఐపిఎల్ మ్యాచ్‌లతో పల్లెల్లో ఎక్కడ చూసినా సాయంత్రం అయ్యేసరికి యువత గుంపులు గుంపులుగా చేరి బెట్టింగులకు పాల్పడుతున్నారు. శని, ఆదివారాల్లో జరుగుతున్న మ్యాచ్‌లకు బెట్టింగులపై ప్రత్యేక దృష్టి సారిస్తున్నారు. ప్రస్తుతం గెలుపు ఓటములతోపాటు, బంతిబంతికి బెట్టింగుల విధానం కొనసాగుతోంది. గతంలో ఎక్కడో హైదరాబాదులో ఉండే ఈ బెట్టింగ్ పిచ్చి నేడు పలెల్లలకు పాకడం పట్ల పలువురు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. పల్లెల్లో యువకులు ఈ బెట్టింగులకు బానిసలుగా మారిపోతున్నారు. బెట్టింగులో పోగొట్టుకున్న యువత అప్పులపాలై జీవితాలను పాడు చేసుకుంటున్నారు. కొంత మంది యువకులు నెలంతా కష్టపడితే వచ్చిన జీతాన్ని బెట్టింగుతో చేతులు కాల్చుకుని కుటుంబ సభ్యులతో తగాదాలకు దిగుతున్నారు. విద్యార్థులైతే ఫీజులు, పుస్తకాలు పేరు చెప్పి తల్లీదండ్రుల నుంచి తీసుకొచ్చి బెట్టింగుల్లో పెడుతున్న సందర్భాలు కన్పిస్తున్నాయి. ఈ కోవలోనే కొత్తపల్లి గ్రామానికి ఒక వ్యక్తి తనకు ఉన్న 3 వాహనాలతో చక్కగా వ్యాపారం చేసుకునేవాడు. అయితే గత ఐదేళ్ల నుంచి ఐపిఎల్ బెట్టింగులో పాల్గొని అప్పుల పాలయ్యాడు. ఆ అప్పులను తీర్చేందుకు ఉన్న వాహనాలను అమ్మకం పెట్టి నేడు డ్రైవర్‌గా పని చేసుకుంటున్నాడు. అలాగే పిఠాపురంలో ఒక బేకరీ యజమాని బెట్టింగ్‌తో అప్పులపాలై నేడు అదే బేకరీలో కూలీగా పనిచేస్తున్నాడు. సెల్‌ఫోన్ అమ్మకం షాపు నిర్వహిస్తూ రిపేర్లు చేస్తూ జీవితాన్ని సజావుగా సాగించిన ఒక యువకుడు బెట్టింగుల పుణ్యమా అని ఆ వృత్తిని, వ్యాపారాన్ని పక్కన పెట్టి నేడు అప్పులపాలై కూలి పనులకు వెళ్లాల్సిన దుస్థితి నెలకుంది. ఇలా మచ్చుకు కొన్నే. ఇదే కోవలో అనేక మంది బెట్టింగుల భారిన పడి కుటుంబాలను, జీవితాన్ని నాశనం చేసుకుంటున్న పరిస్థితులు నిత్యం కళ్లెదుటే కన్పి స్తున్నాయి. ప్రస్తుతం జరుగుతున్న బెట్టింగ్ వ్యవహారం అంతా సెల్‌ఫోన్లు, ఆన్‌లైన్‌లో జరిగిపోతుంది. ప్రతీ ఒక్కరి చేతిలో సెల్‌ఫోన్ అందుబాటులో ఉండటంతో ఈ బెట్టింగ్ వ్యవహారం మరింతగా తేలికైపోయింది. ఎంతో రహస్యంగా జరుగుతున్న ఈ బెట్టింగ్ వ్యవహారంపై పోలీసులు ప్రత్యేక నిఘాను ఏర్పాటు చేసి బెట్టింగ్ నిర్వాహకులపై చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.

మాదిగల ఆత్మీయ కలయిక

ప్రజాశక్తి - సామర్లకోట



సమావేశంలో మాట్లాడుతున్న చలమలశెట్టి సునీల్

పెద్దాపురం నియోజకవర్గ మాదిగల ఆత్మీయ కలియిక సమావేశం జరిగింది. స్థానిక పూ ర్ణా కల్యాణ మండపంలో జరిగిన ఈ సమావేశంలో ఎంఎల్‌సి బొమ్మి ఇజ్రాయిల్, మా దిగ కార్పొరేషన్ ఛైర్మన్ కొమ్మూరి కనకారావు ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సిఎం జగన్ మాదిగలకు మంత్రి, ఎంపీ, ఎంఎల్‌సి, కార్పొరేషన్ పదవులను ఇచ్చారని అన్నారు. రానున్న ఎన్నికల్లో మాదిగ సామాజిక వర్గానికి చెందిన టిప్పర్ డ్రైవర్‌కు ఎంఎల్‌ఎ అభ్యర్థిగా టిక్కెట్టు ఇచ్చారని అన్నారు. రాబోయే ఎన్నికల్లో మాదిగ సామాజికవర్గం అంతా వైసిపికి అండగా నిలవాలని పిలుపునిచ్చారు. టిడిపి, కాంగ్రెస్ పార్టీలు మాదిగలను ఎప్పుడూ ఓటు బ్యాంకుగానే చూశాయని విమర్శించారు. ఈ కార్యక్రమంలో వైసిపి కాకినాడ ఎంపీ అభ్యర్థి చలమలశెట్టి సునీల్, వైసిపి పెద్దాపురం నియోజకవర్గ అభ్యర్థి దవులూరి దొరబాబు పాల్గొని మాట్లాడారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ మాదిగ సంఘ నాయకులు పలివెల జనార్దన్, కాతేటి అరుణ్‌కుమార్, కాళ్ల లక్ష్మీనారాయణ, వల్లూరి నాని, దర్శిపాటి సత్యనారాయణ పాల్గొన్నారు.

అన్ని నియోజకవర్గాల్లోనూ జెబిఆర్‌బి పార్టీ పోటీ

ప్రజాశక్తి - కాకినాడ



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న మల్లిఖార్జున

రాబోయే ఎన్నికల్లో జై భీమ్‌రావ్ భారత్ పార్టీ(జెబిఆర్‌బి) జిల్లాలోని 7 అసెంబ్లీ, ఒక పార్లమెంటు స్థానంలోనూ పోటీ చేస్తుందని ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు జగ్గారపు మల్లిఖార్జున తెలిపారు. శనివారం పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన పాత్రికేయుల సమావేశంలో ఆయన మాట్లాడారు. వైసిపి ఎంఎల్‌ఎ ద్వారంపూడి చంద్రశేఖర రెడ్డి కాకినాడ స్మార్ట్ సిటీని అవినీతికి అడ్డాగా మార్చేశారని దుయ్యబట్టారు. నగరంలో కనీసం మౌలిక సదుపాయాలు కల్పించడంలో వైసిపి ప్రభుత్వం పూర్తిగా విఫలం అయ్యిందన్నారు. ప్రజలకు మెరుగైన పాలన రావాలంటే జై భీమ్‌రావ్ భారత్ పార్టీ అధికారం లోకి రావాల్సిన అవసరం ఉందన్నారు. కాకినాడ అర్బన్ నుంచి న్యాయవాది గింజాల చక్రవర్తి పోటీ చేస్తారని ప్రకటించారు. చక్రవర్తి మాట్లాడుతూ కాకినాడ నగరంలో అవినీతి రహిత పాలన సాగించడం జరుగుతుందని తెలిపారు. ఈ సమావేశంలో పార్టీ జిల్లా కోశాధికారి జి.హరీష్, తదితరులు పాల్గొన్నారు.



మహిళలకు అవగాహన కల్పిస్తున్న ఎంపిడిఒ ఉషారాణి

ఓటు వినియోగంపై అవగాహన పెంచుకోవాలి

ప్రజాశక్తి - పెద్దాపురం

ప్రతి ఒక్కరూ ఓటు హక్కు వినియోగంపై అవగాహన పెంచుకోవాలని ఎంసిసి కన్వీనర్, ఎంపిడిఒ జి.ఉషారాణి అన్నారు. శనివారం మండలంలోని తిరుపతి, చంద్రమాంపల్లి గ్రామాల్లో ఆమె మహిళలకు ఓటింగు యంత్రాలపై ఓటు హక్కు వినియోగంపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె ఓటింగ్ మిషన్ పనిచేసే విధానం, యంత్రంపై తమ అభ్యర్థికి ఓటు వేసిన తర్వాత జరిగే ప్రక్రియ ఓటర్లకు వివరించారు. ఓటు ఉన్న ప్రతిఒక్కరూ తమ ఓటు హక్కును వినియోగించుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ, సచివాలయాల సిబ్బంది పాల్గొన్నారు.

మండలంలో వైసిపి అభ్యర్థి పర్యటన

ప్రజాశక్తి - కాజులూరు



కండువా వేసి పార్టీలోకి ఆహ్వానిస్తున్న సూర్యప్రకాష్

మండలంలోని కాజులూరు, మంజేరు, శీల, పల్లిపాలెం గ్రామాల్లో రాజ్యసభ సభ్యులు పిల్లి సుభాస్‌చంద్రబోస్, వైసిపి అభ్యర్థి పిల్లి సూర్యప్రకాష్ శనివారం పర్యటించారు. మంజేరులో సహకార సంఘ మాజీ అధ్యక్షులు గండి గోపాలంతోపాటు పలువురు వైసిపిలో చేరారు వీరికి కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. పల్లిపాలెం గ్రామంలో నూతనంగా నిర్మించిన రామాలయ ప్రారంభోత్సవ కార్యక్రమం పాల్గొని తీర్థ ప్రసాదాల స్వీకరించారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ పరిశీలకులు చింతలపాటి శ్రీనివాసరాజు, మంజేరు సర్పంచ్ గుంటూరి అప్పారావు, జడ్‌పిటిసి సభ్యులు వనుము వెంకట సుబ్బారావు, ఎంపిపి మాత భారతి, స్థానిక నాయకులు యాళ్ళ బాబు పాల్గొన్నారు.

అభ్యర్థులను మార్చకుంటే సహాయ నిరాకరణ

ప్రజాశక్తి - కాకినాడ

జిల్లాలో పలు నియోజకవర్గాలకు ఎంఎల్‌ఎ అభ్యర్థులుగా ప్రకటించిన వారిని మార్పు చేయకపోతే సహాయ నిరాకరణ చేపడతామని కాంగ్రెస్ పార్టీ నాయకులు తుమ్మలపల్లి వాసు, కోల ప్రసాద్‌వర్మ, లంకే ఫకీర్‌రాజు స్పష్టం చేశారు. శనివారం స్థానిక శాంతినవాస్ భవన్‌లో వారు మీడియాతో మాట్లాడారు. పది రోజుల క్రితం కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ కె.పాండురంగారావు అసెంబ్లీ నియోజకవర్గాలకు అభ్యర్థులను ప్రకటించారని తెలిపారు. దీనిపై తామంత అడిగితే అటువంటిదేమీలేదని, అందరి అభిప్రాయాలు తీసుకుని అభ్యర్థులను ప్రకటిస్తామని చెప్పారన్నారు. అయితే నేడు ఆ అభ్యర్థులనే నియమించినట్లు చెబుతున్నారని అన్నారు. కాంగ్రెస్ పార్టీ కోసం కష్టపడిన వారిని పక్కన పెట్టి ఇతర పార్టీల నుంచి వచ్చిన వారికి, కోవర్టులకు టిక్కెట్టు కేటాయించడం సరికాదన్నారు. ప్రకటించిన అభ్యర్థుల విషయంలో మార్పులు చేయకపోతే తమ నుంచి సహాయ నిరాకరణ తప్పదన్నారు. ఈ సమావేశంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు మద్రి సుజాత, వల్లూరి రామ్మోహన్, మద్రి భీమరాజు, కొల్లాబత్తుల భవాని, ఏసురత్నం, వేమగిరి జయరాజ్, వేమగిరి కాంతం పాల్గొన్నారు.



భద్రతపై సమీక్షిస్తున్న రైల్వే అధికారులు

రైల్వేస్టేషన్‌లో 60 సిసి కెమెరాలు

ప్రజాశక్తి - సామర్లకోట

ప్రయాణికుల భద్రతలో భాగంగా సామర్లకోట రైల్వేస్టేషన్‌లోని 1, 2 ఫ్లాట్‌ఫారాలపై 60 సిసి కెమెరాలు ఏర్పాటుకు చర్యలు తీసుకుంటున్నట్లు కాకినాడ ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ కెవి.గిరి తెలిపారు. శనివారం స్థానిక రైల్వేస్టేషన్లో స్టేషన్ మేనేజర్ ఎం.రమేష్ ఆధ్వర్యంలో ప్రయాణికుల భద్రతపై సమన్వయ కమిటీ సమావేశం జరిగింది. ఫ్లాట్ ఫారాల ఆధునీకరణ అనంతరం సిసి కెమెరాలను ఏర్పా టు చేస్తామని చెప్పారు. సాధారణ ఎన్నికల దృష్ట్యా రైళ్ల ద్వారా అనధికారిక నగదు, మద్యం, తరలింపులు చేపట్టకుండా చర్యలు చేపట్టాలని, ప్రయాణికుల భద్రతకు ప్రాధాన్యత ఇవ్వాలని సమావేశంలో నిర్ణయించారు. సామర్లకోటతోపాటు, పిఠాపురం, అనపర్తి, బిక్కవోలు రైల్వేస్టేషన్‌లో త్వరలో సిసి కెమెరాలు ఏర్పాటు చేస్తున్నట్లు చెప్పారు. ఈ సమావేశంలో రైల్వే సీనియర్ సెక్షన్ ఇంజనీర్ ఎ.బసవేశ్వరరావు, చీఫ్ కమర్షియల్ ఇన్‌స్పెక్టర్ ఎవికె.సంతోష్‌కుమార్, సీనియర్ సెక్షన్ ఇంజనీర్లు నారాయణరాజు, సంజీవ్‌కుమార్, రైల్వే ఎస్ఎస్ శ్రీదేవి, తదితరులు పాల్గొన్నారు.



పట్టుబడిన నగదుతో అధికారులు

తనిఖీల్లో రూ.1,76,538 నగదు సీజ్

ప్రజాశక్తి - సామర్లకోట

వాహన తనిఖీల్లో రూ.1,76,538ల నగదును సీజ్ చేసినట్లు ఆర్ఒ సీతారామారావు తెలిపారు. మండలంలోని పెదబ్రహ్మదేవం గ్రామం వద్ద శుక్రవారం రాత్రి ఫ్లయింగ్ స్క్వాడ్ అధికారి కె.సంజేయ్ కుమార్ ఆధ్వ ర్యంలో వాహన తనిఖీలు నిర్వహించగా వాహనం లో.రూ.1,76,538ల నగదును గుర్తించినట్లు తెలిపారు. ఈ నగదుకు సంబంధించి అవసరమైన పత్రాలు లేకపోవడంతో పితాని మణికంఠ అనే వ్యక్తి నుంచి నగదును స్వాధీనం చేసుకుని కాకినాడ ట్రజరీకి జమ చేసినట్లు తెలిపారు.

ఆలయానికి రూ.3.22 లక్షల ఆదాయం

ప్రజాశక్తి - పెద్దాపురం

మండలంలోని తిరుపతి గ్రామం ఉన్న శృంగార వల్లభ స్వామి ఆలయానికి శనివారం ఒకరోజు రూ.3.22 లక్షల ఆదాయం సమకూరిందని ఆలయ కార్యనిర్వహణాధికారి వడ్డి శ్రీనివాస్ తెలిపారు. వివిధ దర్శనం టికెట్ల ద్వారా రూ.2,51,580, అన్నదాన విరాళాల ద్వారా రూ.62,310, కేశఖండన ద్వారా రూ.8,240, తులాభారం ద్వారా రూ.450, కానుకలు ద్వారా రూ.216 ఆదాయం సమకూరిందన్నారు. యాత్రికులకు ఉదయం పులిహోర, మధ్యాహ్నం మహా అన్నదానం నిర్వహించారు. వేసవిని దృష్టిలో పెట్టుకుని మజ్జిగ పంపిణీ నిర్వహించారు. అర్చకులు పెద్దింటి పురుషోత్తమాచార్యులు, నారాయణాచార్యులు, పాల్గొన్నారు.

బాధితునికి ఆర్థిక సాయం

ప్రజాశక్తి - తాళ్లరేవు

రోడ్డు ప్రమాదంలో గాయాలపాలైన ఒక యువకునికి కుడుపూడి శివన్నారాయణ ఆర్థిక సాయాన్ని అందించారు. మండలంలోని పోలేకురు పంచాయతీ చిన బాపనపల్లి గ్రామానికి చెందిన కొంకే నవీన్ కుమార్ ప్రమాదంలో గాయాలపాలయ్యాడు. హైదరబాద్‌లో శస్త్రచికిత్స చేయించుకున్నాడు. అయితే ఆపరేషన్ ఫలించకపోవడంతో ఎడమ చేయి పనిచేయడం లేదు. ఈ నేపథ్యంలోనే ఆ యువకుడికి శివన్నారాయణ రూ.10 వేల నగదును శనివారం యువకుడు నవీన్ కుమార్‌కు అందించారు. ఈ కార్యక్రమంలో చినబాపనపల్లి గ్రామ పెద్దలు పాల్గొన్నారు.



విద్యార్థి వినోదినిని అభినందిస్తున్న యాజమాన్యం

పూర్వ విద్యార్థినికి సన్మానం

ప్రజాశక్తి - ఏలేశ్వరం

ఇంటర్మీడియట్ ఫలితాల్లో విశేష ప్రతిభ కనబరిచిన భాష్యం పాఠశాల పూర్వ విద్యార్థిని కొత్త వినోదిని పలువురు అభినందించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపల్ గొల్లపల్లి అనిల్ కుమార్ మాట్లాడుతూ తమ పాఠశాలలో 10వ తరగతి వరకు చదివి ఇంటర్మీడియట్ ఫలితాల్లో 988/1000 సాధించిన కొత్త వినోదిని అభినందనీయురాలు అన్నారు. అనంతరం శాలువ, మెమెంటోతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

నేమాంలో 'పిల్లి' దంపతుల ప్రచారం

ప్రజాశక్తి - కాకినాడ రూరల్

మండలంలోని నేమాం గ్రామంలో మాజీ ఎంఎల్ఎ పిల్లి అనంత లక్ష్మి, పిల్లి సత్యనారాయణమూర్తి దంపతులు ఎన్నికల ప్రచారాన్ని నిర్వహించారు. జనసేన పార్టీ అభ్యర్థులు పంతం నానాజీ, తంగెళ్ల ఉదయ్ శ్రీనివాస్‌ల విజయం కోరుతు టిడిపి, జనసేన పార్టీ శ్రేణులతో ఇంటింటా ప్రచారాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా సూపర్ సిక్స్ పథకాలను ప్రజలకు వివరించారు. ఈ కార్యక్రమంలో పంతం సందీప్, టిడిపి, జనసేన నాయకులు పాల్గొన్నారు.

ఇంటింటా ప్రచారంలో జనసేన అభ్యర్థి

ప్రజాశక్తి - కరప

మండలంలోని ఉప్పలంక, మొండి ప్రాంతాల్లో జనసేన కాకినాడ రూరల్ నియోజకవర్గ అభ్యర్థి పంతం నానాజీ ఇంటింటా ప్రచారాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వైసిపి ప్రభుత్వ పాలనలో వైఫల్యాలను ప్రజలకు వివరించారు. అలాగే టిడిపి, జనసేన, బిజెపి కూటమి అధికారంలోకి వచ్చాక చేపట్టే పథకాలను ప్రజలకు వివరించారు. ఈ కార్యక్రమంలో టిడిపి, జనసేన పార్టీల నాయకులు కటకంశెట్టి బాబీ, నులుకుర్తి వెంకటేశ్వరరావు, చప్పిడి వెంకటేశ్వరరావు, దేవు వెంకన్న తదితరులు పాల్గొన్నారు.

వాలంటీర్లు రాజీనామా చేయొద్దు



ప్రజాశక్తి - పెద్దాపురం

వాలంటీర్లు రాజీనామా చేయొద్దని మున్సిపల్ మాజీ ఛైర్మన్, టిడిపి రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి రాజా సూరిబాబు రాజు ఒక ప్రకటనలో విజ్ఞప్తి చేశారు. వాలంటీర్లు అందరూ మూకుమ్మడిగా రాజీనామా చేయాలని వైసిపి నేతలు తీవ్రంగా ఒత్తిడి చేస్తున్నారని, టిడిపి అధికారంలోకి వస్తే వాలంటీర్లను యథావిధిగా కొనసాగించడంతోపాటు, వారికి నెలకు రూ.10 వేలు వేతనం ఇస్తామని చెప్పారు. వాలంటీర్లు తమ భవిష్యత్తును దృష్టిలో పెట్టుకుని నిర్ణయం తీసుకోవాలన్నారు.

ఇంటర్ ఫలితాల్లో 'ఆనంద్' విజయకేతనం

ప్రజాశక్తి -దేవరపల్లి రూరల్

ఇంటర్ ఫలితాల్లో ఆనంద్ ఎడ్యుకేషనల్ విద్యార్థులు విజయకేతనం ఎగురవేశారని ప్రిన్సిపల్ ఎం.విక్రమ్ తెలిపారు. ఈ సందర్భంగా విజయం సాధించిన విద్యార్థులకు, తల్లిదండ్రులకు, కళాశాల యాజమాన్యం స్వీట్లు అందించి అభినందనలు తెలిపింది. ఈ సందర్భంగా కళాశాల కరస్పాండెంట్ డి.సువర్ణరాజు మాట్లాడారు. తమ కళాశాల విద్యార్థులు విద్యతో పాటు, క్రీడా రంగంలో జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో విజయాలు సాధిస్తున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో కళాశాల ఎ.ఆనంద్ ప్రసాద్, కళాశాల సిబ్బంది, విద్యార్థులు, వారి తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు.

సిబ్బంది, అధికారులు అవగాహనతో పనిచేయాలి

ప్రజాశక్తి - తుని, ప్రత్తిపాడు, పెద్దాపురం

ఎన్నికల అధికారులు, సిబ్బంది ఎన్నికల పట్ల సంపూర్ణ అవగాహన ఉండటం ద్వారానే ఎన్నికల విధులను సక్రమంగా నిర్వహించగలమని కలెక్టర్ జె.నివాస్ అన్నారు. శనివారం ఆయన తుని, ప్రత్తిపాడు, పెద్దాపురం నియోజకవర్గాల్లో నిర్వహిం చిన ఎన్నికల సిబ్బందికి నిర్వహిస్తున్న శిక్షణ తరగతులను పరిశీలించారు. అనంతరం ఆయా డిస్ట్రిబ్యూషన్ సెంటర్లను పరిశీలించారు. తుని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఏర్పాటుచేసిన డిస్ట్రి బ్యూషన్ సెంటర్‌ను పరిశీలించారు. అదేవిధంగా ప్రత్తిపాడు నియోజక వర్గానికి సంబంధించి ప్రత్తి పాడు జడ్‌పి ఉన్నత పాఠశాలలో ఏర్పాటుచేసిన పోలింగ్ సిబ్బంది శిక్షణ కార్యక్రమాన్ని పరిశీలించి అధికారులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం పెద్దాపురంలో మహారాణి



వివరాలను తెలుసుకుంటున్న కలెక్టర్ నివాస్

కళాశాలలో ఏర్పాటుచేసిన డిస్ట్రిబ్యూషన్ సెంటర్‌ను, ఇవిఎంల స్టోరేజ్ రూమును, ఇతర వసతులను పరిశీలించి అధికారులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ నివాస్ మాట్లాడుతూ ఎన్నికల ప్రక్రియ పట్ల పిఒలు, ఇతర సిబ్బంది సంపూర్ణ అవగాహనతో ఉండాలన్నారు. పోలింగ్ ప్రక్రియ ప్రారంభం ముందు నిర్వహించే మాక్ పోల్ అత్యంత కీలకమని పోలింగ్ సిబ్బందికి వివరించారు. ఇవిఎం, వివి ప్యాడ్ పనితీరు, పిఒ డైరీ, ఇతర డాక్యుమెంట్స్ పూర్తి చేయుటంలో ఎటువంటి తప్పులకు తావు లేకుండా అప్రమత్తతతో వ్యవహరించాలన్నా రు. డిస్ట్రిబ్యూషన్ సెంటర్ల వద్ద పోలింగ్ సిబ్బంది ఇటువంటి ఇబ్బందులు పడకుండా అన్ని ఏర్పాట్లు సక్రమంగా చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో తుని రిటర్నిం గ్ అధికారి కెవి.రామలక్ష్మి, ప్రత్తిపాడు రిటర్నింగ్ అధికారి ఎ.శ్రీనివాసరావు, పెద్దాపురం రిటర్నింగ్ అధికారి జె.సీతారామరావు, ఇతర ఎన్నికల అధికారులు సిబ్బంది పాల్గొన్నారు.

క్షణికావేశ నిర్ణయాలు నష్టదాయకం

ప్రజాశక్తి - గండేపల్లి

క్షణికావేశంలో తీసుకునే నిర్ణయాలు నష్టదాయకమని ఇంటర్నేషనల్ ఫౌండేషన్ కాకినాడ జిల్లా శాఖ ప్రతినిధి, జాతీయ పర్యావరణ మిత్ర తోటకూర గంగాధర్ అన్నారు. శనివారం సూరంపాలెం ఆదిత్య యూనివర్సిటీ గ్రంథాలయ విభాగంలో స్పందన ఈదా ఇంటర్నేషనల్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ప్రత్యేక సదస్సు జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎంతో విలువైన జీవితాన్ని ఆవేశంతో అనాలోచితంగా ముగింపు పలకటం పిరికితనమేనని అన్నారు. విద్యార్థులు తమ బంగారు భవిష్యత్‌ను తల్లిదండ్రులు పిల్లలపై పెంచుకున్న ఆశలు అడియాశలు అవుతాయని అన్నారు. సమాజంలో ఎందరో మనకన్నా హీనస్థితిలో దుర్భర పరిస్థితుల్లో కష్టాలకు ఎదురీదుతూ జీవిస్తున్నారని



సమావేశంలో మాట్లాడుతున్న గంగాధర్

గుర్తుంచుకోవాలన్నారు. చిన్నపాటి సమస్యకు విలువైన జీవితాన్ని ముగించడం, పరీక్షల్లో తప్పినంత మాత్రానా ఆత్మహత్యలకు పాల్పడటం మంచిది కాదన్నారు. విద్యార్థులు మనోధైర్యంతో ముందుకు సాగాలని అన్నారు. గ్రంథాలయ విభాగం అధిపతి కె.అశోక్ కుమార్ మాట్లాడుతూ పరీక్షల సమయంలో విద్యార్థులు మానసిక ధైర్యాన్ని కోల్పోకుండా ముందుకు సాగాలని సూచించారు.

దొరబాబు విజయం కోసం ప్రచారం

ప్రజాశక్తి - పెద్దాపురం



ఓటర్లను అభ్యర్థిస్తున్న చంద్రకళ

పట్టణ పరిధిలోని 7, 17 వార్డుల్లో వైసిపి పెద్దాపురం నియోజకవర్గ అభ్యర్థి దవులూరి దొరబాబు సతీమణి చంద్రకళ ఇంటింటా ప్రచారం నిర్వహిం చారు. అయ్యరక కార్పొరేషన్ ఛైర్‌పర్సన్ ఆవాల రాజేశ్వరి, మున్సిపల్ ఛైర్‌పర్సన్ బొడ్డు తులసి మంగతాయారు, వైస్ ఛైర్మన్ నెక్కంటి సాయి ప్రసాద్, అగ్రో డైరెక్టర్ సయ్యద్ జానీల ఆధ్వర్యంలో జరిగిన ఈ ప్రచార కార్యక్రమంలో ఆమె ఇంటింటికీ వెళ్లి వైసిపికి ఓటు వేసి గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కౌన్సిలర్లు సయ్యద్ అమీనా బీబీ, త్సలికి సత్యభాస్కర్, విడదాసరి రాజా, తాటికొండ వెంకటలక్ష్మి, నీలం శెట్టి అమ్మాజీ, యండమూరి విజయలక్ష్మి, వైసిపి పట్టణ అధ్యక్షులు కాపుగంటి కామేశ్వరరావు పాల్గొన్నారు.

ఎన్నికల నిర్వహణకు సహకరించండి

ప్రజాశక్తి - పెద్దాపురం

నియోజకవర్గ పరిధిలో ప్రశాంతంగా ఎన్నికల ప్రక్రియ పూర్తయ్యేందుకు అన్ని రాజకీయ పార్టీల ప్రతినిధులు సహకరించాలని డిఎస్‌పి లతాకుమారి కోరారు. శనివారం స్థానిక డిఎస్‌పి కార్యాలయంలో నియోజకవర్గ పరిధిలోని అన్ని రాజకీయ పార్టీల ప్రతినిధులతో ఎన్నికల ప్రక్రియపై సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఎన్నికల ప్రవర్తనా నియమావళిని రాజకీయ పార్టీల ప్రతినిధులు పూర్తిస్థాయిలో అమలు చేయాలన్నారు. ముందస్తు అనుమతులు లేకుండా ప్రచారాలు, ర్యాలీలు చేయరాద న్నారు. సరైన రికార్డులు లేకుండా నగదు తీసుకెళ్ల



సమావేశంలో మాట్లాడుతున్న డిఎస్‌పి లతాకుమారి

రాదన్నారు. ఎన్నికల బృందాలు నియోజక వర్గంలో తిరుగుతున్నాయని ఎన్ని కల నిబంధనలు ఉల్లంఘించినట్టు తెలిపారు. ఈ సమావేశంలో సిఐ రవికుమార్, ఎస్ఐ వి.సురేష్, రాజకీయ పార్టీల ప్రతినిధులు గవరసాన సూరిబాబు, రంది సత్యనారాయణ, విత్తనాల వెంకటరమణ, నీలపాల సూరిబాబు, దారపురెడ్డి క్రాంతికుమార్, పెదిరెడ్ల సత్యనారాయణ పాల్గొన్నారు.

విజయవంతంగా బూట్ క్యాంప్ శిక్షణ

ప్రజాశక్తి - గండేపల్లి

మండలంలోని సూరంపాలెం ఆర్ టెక్ సాఫ్ట్‌వేర్ సొల్యూషన్స్ అండ్ ఆదిత్య యూనివర్సిటీ ఇంజనీరింగ్ కళాశాలలో 'మాట్ ల్యాబ్ పరిచయం' అనే కోర్సుపై బూట్ క్యాంప్ శిక్షణా కార్యక్రమం విజయవంతంగా నిర్వహించినట్లు కళాశాల ప్రిన్సిపల్ ప్రొఫెసర్ డాక్టర్ మేడపాటి శ్రీనివాసరెడ్డి తెలిపారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులకు ఎలక్ట్రానిక్ రంగంలో వినియోగించే ఎంబెడెడ్ సిస్టమ్ బోర్డు వాటిలో ఉపయోగించే మాట్ ల్యాబ్ సాఫ్ట్‌వేర్, సిమ్ లింక్, కోడ్ జనరేషన్, కోడ్ డీ బగ్గింగ్, డంపింగ్ పద్ధతి, వాటి అప్లికేషన్ గురించి వివరించారు. రియల్ టైం ఇండస్ట్రియల్ ఎంబెడెడ్ సిస్టమ్ ఎక్స్‌పర్ట్ చంద్రశేఖర్ నామాల, అనిల్‌కుమార్ పొన్నగంటి పాల్గొన్నారు. అసిస్టెంట్ ప్రొఫెసర్ టి.రవీంద్ర కో-ఆర్డినేటర్ వ్యవహరించారు. అలాగే ఆదిత్య యూనివర్సిటీ, ద్వితీయ సంవత్సరం ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్ ఇంజినీరింగ్ విభాగంలో 'రీసెంట్ ట్రెండ్స్ ఇన్ బ్రాడ్ కాస్టింగ్- టెక్నాలజీ డెవలప్మెంట్స్ ఇన్ వాస్ట్ డిజిటల్ ప్లాట్‌ఫామ్' అనే గెస్ట్ లెక్చర్ విజయవంతంగా నిర్వహించినట్లు తెలిపారు. దూరదర్శన్ అసిస్టెంట్ డైరెక్టర్ పి.కాశీప్రసాద్ ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. నూతన ఆవిష్కరణలకు శ్రీకారం చుట్టాలన్నారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపల్ ప్రొఫె సర్ డాక్టర్ మేడపాటి శ్రీనివాసరెడ్డి, డీన్, ప్రొఫెసర్ డాక్టర్ జి.సురేష్, డీన్, అసోసియేట్ ప్రొఫెసర్ వి.సత్యనారాయణ, ఇసిఇ అధిపతులు డాక్టర్ ఎన్.రాధా, డాక్టర్ కర్ణ విష్ణువర్ధన రెడ్డి, కోఆర్డినేటర్ అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ ఎండీ.తాజ్, బి.శ్రీదేవి మాట్లాడారు.

సిబిసిఎన్‌సి భూములను కాపాడాలి

ప్రజాశక్తి - కాకినాడ

సిబిసిఎన్‌సికి చెందిన వేలకోట్ల ఆస్తులను కాపాడాలని పలువురు డిమాండ్ చేశారు. శనివారం జడ్‌పి సెంటర్ వద్ద ఉన్న సిబిఎం కాంపౌండ్ వద్ద క్రైస్తవులు నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా రెవ.జ్యోతికుమార్ రెడ్డి, రెవ.డాక్టర్ బిహెచ్‌వి.మూర్తిరాజు, రెవ. మేరా జేసుదాస్ మీడియాతో మాట్లాడారు. సిబిఎం కాంపౌండ్‌లో ఉన్న పురాతన భవనాలను కూల్చి విలువైన కలపను అక్రమంగా తొలగించడం అన్యాయమన్నారు. కులమతాలకతీతంగా దేవుడు భూములను కాపాడుకోవాల్సిన అవసరం ఉందన్నారు. దైవ సేవకుల ముసుగులో దేవుడు భూమిలనే కబ్జా చేస్తున్న కార్పొరేటర్ సేవకులైన కల్వరి సతీష్ కుమార్‌ను, అనధికారంగా కాంపౌండ్‌లో నివసిస్తున్న రత్న కుమార్‌లను సిబిఎం క్యాంపస్ నుంచి వెళ్లగొట్టాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సిబిసిఎన్‌సి సెక్రటరీ రెవ జాన్, రెవ. ఎంపి విజయకుమార్, శీలం ఐజాక్, జాన్‌వెస్లీ, తదితరులు పాల్గొన్నారు.

ప్రగతి కళాశాలలో ప్లేస్‌మెంట్ డే

ప్రజాశక్తి - గండేపల్లి

మండలంలోని సూరంపాలెం ప్రగతి ఇంజనీరింగ్ కళాశాలలో శనివారం ప్లేస్మెంట్ డే-2024 వేడుకలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పవర్ మెక్ ప్రాజెక్ట్స్ లిమిటెడ్ ఛైర్మన్, ఎండి సజ్జా కిషోర్‌బాబు, విశిష్ట అతిథిగా పారిశ్రామికవేత్త రాహుల్ శ్రీనివాస్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా కళాశాల ఛైర్మన్ డాక్టర్ పరుచూరి కృష్ణారావు మాట్లాడుతూ 2024 సంవత్సరంలో బి.టెక్ పూర్తి చేసుకుని, ఉద్యోగాలు సాధించిన 1119కి పైగా విద్యార్థినీ, విద్యార్థులను, వారి తల్లిదండ్రులను అభినందించడానికి నిర్వహిస్తున్నట్లు తెలిపారు. 2001 నుంచి ప్రగతి ఇంజనీరింగ్ కళాశాలలో నిరంతరం కళాశాల ప్రాంగణ ఎంపికల ద్వారా ఉద్యోగ కల్పనలో పురోగతిని సాధిస్తూ, విద్యార్థులలో భవిష్యత్తు పట్ల ఆశ పెంపొందించేలా ఎన్నో ఉత్తమ బహుళజాతి సంస్థలైన కంపెనీలలో అత్యుత్తమ ప్యాకేజీలతో ఉద్యోగ నియామకాలు పొందారన్నారు. కంపెనీలలో సగటు వార్షికాదాయాలతో ఉద్యోగ నియామకాలు పొందారని వివరించారు. ఈ కార్యక్రమంలో కళాశాల డైరెక్టర్ మేనేజ్‌మెంట్ ఎంవి.హరనాథ్‌బాబు, వైస్ ప్రెసిడెంట్ ఎం.సతీష్, ప్రిన్సిపల్ కె.సత్యనారాయణ, జి.నరేష్, వివిధ విభాగాధిపతులు, విద్యార్థినీ, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

పిఒ, ఎపిఒలకు కొనసాగిన శిక్షణ

ప్రజాశక్తి - కాకినాడ

ఎన్నికల విధులపై ప్రిసైడింగ్ అధికారులు, అసిస్టెంట్ ప్రిసైడింగ్ అధికారులకు రెండో రోజైన శనివారం శిక్షణా కార్యక్రమం కొనసాగింది. స్థానిక పిఆర్ ప్రభుత్వ కళాశాలలో జరుగుతున్న శిక్షణ కార్యక్రమాన్ని సిటీ నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి జె.వెంకటరావు పర్యవేక్షించారు. ఎన్నికల సమయంలో చట్టపరమైన, సాంకేతిక పరమైన అంశాలు, ఎన్నికల విధుల్లో తీసుకోవలసిన జాగ్రత్తలు, అనుసరించాల్సిన నిబంధనలు, ఇవిఎం, వివి ప్యాట్ల పనితీరు సహా అనేక అంశాలపై శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా రిటర్నింగ్ అధికారి వెంకటరావు మాట్లాడుతూ ఎన్నికలు ప్రశాంత వాతావరణంలో, సజావుగా నిర్వహించడంలో పిఒ, ఎపిఒల పాత్ర కీలకమన్నారు. ఎన్నికల నిబంధనలను ప్రతి ఒక్కరూ అవగాహన చేసుకుని సమర్థవంతంగా ఎన్నికల నిర్వహించాలని సూచించారు. మలి విడత శిక్షణలో భాగంగా ఈనెల 15, 16వ తేదీలలో ఒపిఒలకు కూడా శిక్షణ ఇస్తామన్నారు.

కొండెక్కిన కోడి

- ఉత్పత్తి లేక ధర పైపైకి
- రూ.300 పైగా పలుకుతున్న చికెన్ ధర
- ఉష్ణోగ్రతల కారణంగా పెంపకానికి వెనుకంజ

ప్రజాశక్తి- రాజోలు

పెరుగుతున్న ఎండలు కూరగాయలతో పాటు మాంసం ధరలపై తీవ్ర ప్రభావం చూపాయి. రోజురోజుకూ కోడిమాంసం వెల కొండెక్కుతోంది. మొన్నటి వరకు కిలో రూ.200 పలికిన చికెన్ ధర నేడు రూ.300కు చేరింది.దీంతో దుకాణానికి వెళ్లిన వారు ధర అడిగి కొనుగోలు చేయాల్సిన దుస్థితి నెలకొంది. కిలో తీసుకునే వారు ధరను చూసి అరకిలోకే పరిమితమవుతున్నారు. ఉమ్మడి జిల్లాలో నిత్యం 55 టన్నుల వరకు కోడిమాంసం విక్రయాలు సాగుతాయి. ఆదివారం, గురువారం రోజుల్లో 70 టన్నులకుపైగా అమ్ముతుంటామని వ్యాపారులు చెబుతున్నారు.

పండుగలు.. పెళ్లిళ్లతో

పండుగలు ఓవైపు, మరోవైపు పెళ్లిళ్ల సీజన్ కావడంతో చికెన్ బాగా డిమాండ్ పెరిగింది. పండగల్లో చికెన్ వ్యాపారుల నుంచి ఆర్డర్ లు బాగా పెరిగాయి. ఇదే తరుణంలో పెళ్లిళ్లు, శుభకార్యాలు ఉండటంతో చికెన్ ధరలు పెరుగుతున్నాయి. మొక్కజొన్న వంటి పంటలు తగ్గడంతో దాని ధర పెరిగింది. ఇక హెచ్ఆర్సి లో కోడి పిల్లల ధర పెరిగింది. రూ.25 నుంచి రూ.30 ఉన్న కోడిపిల్ల ధర ప్రస్తుతం రూ.53 పలుకుతోంది. ఇక నిర్వహణ ఖర్చులు పెరిగాయి. ప్రస్తుతం 42 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదు అవడంతో కోళ్లు తట్టుకోవు. ఉష్ణోగ్రతలు, వడగాల్పుల కాలం కావడంతో కోళ్ల పరిశ్రమకు నష్టం జరుగుతుందని భావించి నిర్వాహకులు, రైతులు కోళ్ల పెంపకానికి వెనుకంజ వేస్తున్నారు. ఉష్ణోగ్రతతో కోళ్లు చనిపోతే కోలుకోలేని దెబ్బ పడుతుందని భావిస్తున్నారు. కోళ్ళు సాధారణంగా 40 రోజుల్లో 2 నుంచి 3 కిలోల బరువు పెరుగుతుంది. కానీ వేసవిలో 48 రోజులు పడుతుంది. ప్రస్తుతం ఒక కోడి పెంప కానికి రూ.125 నుంచి రూ.135 వరకు ఖర్చు అవుతుంది. కంపెనీలు ప్రస్తుతం రూ.145 వరకు విక్రయిస్తున్నాయి. దీంతో రిటైల్డ్ గా స్కిన్ లెస్ చికెన్ రూ.300 నుంచి రూ.320 వరకు విక్రయిస్తుండగా, విత్ స్కిన్ లెస్ రూ.280, లైవ్ కోడి రూ.180 వరకు విక్రయిస్తున్నారు.

చేపలపై ఆసక్తి

రోజురోజుకూ పెరుగుతున్న చికెన్ ధరలను చూసి మాంసం ప్రియులు చేపల వైపు ఆసక్తి చూపుతున్నారు. ఉమ్మడి జిల్లాలోని పట్టణాల్లో ఎక్కడ చూసినా రహదారుల వెంట విక్రయదారులే కనిపిస్తున్నారు.



కోడి మాంసం విక్రయిస్తున్న దుకాణదారుడు

స్థానికంగా చెరువుల వద్ద రూ.100, పట్టణాల్లో కిలో రూ.150కి విక్రయిస్తున్నారు. చికెన్‌కు వెచ్చించే ధర చూస్తే చేపలు రెండు కిలోల వరకు వస్తుండటంతో వీటిని తినడానికి ప్రజలు ఇష్టపడుతున్నారు.

వ్యాపారం లేక నష్టపోతున్నాం



ఎండల వేడిమికి కోళ్ల ఉత్పత్తి తగ్గింది. దీంతో చికెన్ ధరలు రోజురోజుకు పెరిగిపోతున్నాయి. మార్కెట్లో లైవ్‌కోడి ధర రూ.230 పైనే పలుకుతోంది. ఇలాంటి సమయంలో ధరలు పెరగడం మామూలే. ధరలు పెరగడంతో చికెన్ కొనేందుకు జనాలు రావడం లేదు. మధ్యాహ్నం కిలోపై రూ.20 తగ్గించినా ఎవరు కొనడం లేదు. ప్రతిరోజు వ్యాపారంలో నష్టపోతున్నాం. చికెన్ ధరలు తగ్గించాలి.

- ఎడిద నానాజీ, చికెన్ వ్యాపారి, రాజోలు

పంట కోత ప్రయోగంలో 54 బస్తాల దిగుబడి



చోడవరంలో పంట కోత ప్రయోగం

ప్రజాశక్తి-రామచంద్రపురం

పంట కోత ప్రయోగం ద్వారా రామచంద్రపురం మండలం చోడవరం గ్రామంలో శనివారం మండల వ్యవసాయ శాఖ దాల్వా వరి దిగుబడిని అంచనా వేశారు. దీని ద్వారా ఎకరాకు 54 బస్తాలు చొప్పున దిగుబడి సాధించారని మండల వ్యవసాయ అధికారి ఎన్. సత్య ప్రసాద్ తెలిపారు. శనివారం చోడవరం రైతు బిక్కిన జగదీష్ చౌదరి పొలంలో పంట కోత ప్రయోగం నిర్వహించినట్లు ఎ.ఒ. తెలిపారు. దాల్వా పంటలు ఆశాజనకంగా ఉండడంతో ఎకరాకు 55 నుంచి 60 బస్తాలు దిగుబడులు సాధించే అవకాశం ఉన్నట్లు ఆయన వివరించారు. కార్యక్రమంలో వివిఎ దుర్గ భవాని, రైతులు, పాల్గొన్నారు

అంబేద్కర్ జయంతి వేడుకల్లో నిబంధనలు పాటించాలి

ప్రజాశక్తి,-మండపేట

అంబేద్కర్ జయంతి సందర్భంగా నిర్వహించే వేడుకల్లో పలు నిబంధనలు పాటించాలని పట్టణ, రూరల్ పోలీసులు తెలిపారు శనివారం ఈ సందర్భంగా పట్టణ, రూరల్ ఎస్ఐలు హరికోటీ శాస్త్రి, చైతన్య కుమార్ వాట్లాడుతూ మండపేట పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లోని పలు అంబేద్కర్ విగ్రహ కమిటీ సభ్యులు ర్యాలీలు, డీజేలు వంటి కార్యక్రమాలు నిర్వహించరాదన్నారు. సైలెన్సర్ లేని ద్విచక్ర వాహనాలపై చక్కర్లు కొట్టడం, ట్రిపుల్ రైడింగ్ వంటి చర్యలకు పాల్పడితే చట్టపరమైన కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. విగ్రహ కమిటీలు కేవలం విగ్రహాల వద్ద మాత్రమే నిబంధనలకు అనుగుణంగా వేడుకలు నిర్వహించుకోవాలని విజ్ఞప్తి చేశారు. రామచంద్రాపురం డివిజన్ పరిధిలో పోలీస్ యాక్ట్ 30, సెక్షన్ 144 సిఆర్పిసి నిబంధనలు, ఎన్నికల నేపథ్యంలో ఎన్నికల కోడ్ ఆంక్షలు అమల్లో ఉన్నాయన్నారు. నియోజకవర్గంలోని ఊరువాడ అన్ని చోట్ల అంబేద్కర్ జయంతి ఉత్సవాలకు జై భీమ్ యూత్ సభ్యులు ఏర్పాట్లను చేస్తున్నారు. ఏర్పాట్ల పనిలో అక్కడ నాయకులు నిమగ్నమయ్యారు.

మండుతున్న ఎండలు

నిర్మానుష్యంగా రహదారులు

ప్రజాశక్తి-మండపేట

నిత్యం రద్దీగా జనంతో కిక్కిరిసిపోయి ఉండే కపిలేశ్వరపురం రోడ్డు శనివారం మధ్యాహ్నం నిర్మానుష్యంగా మారింది. మండుతున్న ఎండలకు ప్రజలు ఇళ్లకే పరిమితమవుతున్నారు. ఎండ తీవ్రతతో పలు దుకాణాలు మూతపడుతున్నాయి. ఉదయం, సాయంత్రం వేళల్లో కాయకూరలు, నిత్యావసర తదితర వస్తువులను ప్రజలు కొనుగోలు చేసేందుకు బయటకు వస్తున్నారు. తప్పనిసరిగా వెళ్లవలసిన వారు, వ్యవసాయ కూలీలు తలపాగా, గొడుగులు ధరించి ప్రయాణాలు సాగిస్తున్నారు. ఎండ నుంచి ఉపశమనం ఉండేందుకు దాహార్తిని తీర్చుకునేందుకు ప్రయాణికులు జూస్ సెంటర్లను ఆశ్రయిస్తున్నారు. పండ్లు, ఐస్, జూస్ లకు వినియోగించే ఆహార పదార్థాల ధరలు పెరిగిన నేపథ్యంలో జూస్ రేట్లు కూడా పెంచి అమ్ముతునప్పటికీ జ్యూస్ సెంటర్లకు గిరాకీ పెరిగింది. జ్యూస్ సెంటర్ వద్ద ప్రజలు క్యూ కడుతున్నారు. ఈ నేపథ్యంలో ఈ సెంటర్లలో నాణ్యత ఏర్పాట్లను అధికారులు పరిశీలించాలని పలువురు కోరుతున్నారు.



నిర్మానుష్యంగా కపిలేశ్వరపురం రోడ్డు

న్యాయవాది సుబ్బారావు చిత్రపటం ఆవిష్కరణ

ప్రజాశక్తి -రామచంద్రపురం



కార్యక్రమంలో పాల్గొన్న బార్‌అసోసియేషన్

రామచంద్రపురం బార్ అసోసియేషన్ భవననిర్మాత, ప్రముఖ సీనియర్ న్యాయవాది, స్వర్గీయ తెలి దేవర సుబ్బారావు (ఎస్ఆర్‌టి) చిత్రపటావిష్కరణ కార్యక్రమం బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో శనివారం నిర్వహించారు. అధ్యక్షుడు పిల్లి మురళి మోహన వెంకటరమణ అధ్యక్షతన జరిగిన సమావేశంలో సాలగ్రామ శ్రీనివాస సుబ్రహ్మణ్యం, ఎస్ఆర్ టి కుటుంబ సభ్యులు పాల్గొన్నారు. కార్యక్రమానికి రాజమహేంద్రవరం బార్ అసోసియేషన్ మాజీ అధ్యక్షుడు చింతపెంట ప్రభాకర్ రావు ముఖ్య అతిథిగా హాజరై చిత్రపటాన్ని ఆవిష్కరించారు. అనంతరం మాట్లాడుతూ న్యాయవాదులు విజ్ఞానాన్ని సమాజానికి అందించవలసిన బాధ్యత ప్రతి ఒక్కరిపైనా ఉందన్నారు. న్యాయవాదులు తమ విజ్ఞానాన్ని జూనియర్ న్యాయవాదులకి అందించాలన్నారు. .రిటైర్డ్ జిల్లా జడ్జి దినవాహి లక్ష్మీకామేశ్వరి , సీనియర్ సివిల్ జడ్జి కె.వెంకటేశ్వరరావు మాట్లాడారు. ఈ కార్యక్రమంలో సీనియర్ న్యాయవాదులు వివిఆర్‌ఎస్ సుబ్రహ్మణ్యం, మల్లిడి హరినాథ్‌రెడ్డి, బుద్ధవరపు సూర్యనారాయణ, అల్లం గనిరాజు, వాకలపూడి జయశంకర్, కె.వి.సత్యవాణి, బి.నరసింహమూర్తి, వాడ్రేవు సాయి ప్రసాద్, డిఎస్ఎస్.శర్మ, సిహెచ్.వీరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఎన్ఆర్ఐ 'రాయుడు'కు ఉగాది నంది పురస్కారం

ప్రజాశక్తి-ఆలమూరు



పురస్కారం స్వీకరిస్తున్న రాముడు వెంకటేశ్వరరావు

చెముడు లంకకు చెందిన ఎన్ఆర్ఐ (బెహరాన్)రాయుడు వెంకటేశ్వరరావుకు ఉగాది నంది పురస్కారం స్వీకరించారు. శనివారం ఫిలాంత్రోఫిక్ సొసైటీ ఆధ్వర్యంలో రాజ మహేంద్రవరంలో ఉగాది జాతీయ నంది పురస్కారాల ప్రదానోత్సవం నిర్వహించారు. బెహరాన్ లో ఉద్యోగ బాధ్యతలు నిర్వహిస్తున్న రాయుడు జన్మభూమి మీద ఉన్న మమకారంతో ఈ ప్రాంతంలో సేవా కార్యక్రమాలు నిర్వహిస్తుంటారు. వివిధ ప్రాంతాలలో స్థిరపడిన ఎన్నారైల సహకారంతో చెముడులంకలో స్థానిక హైస్కూల్లో డిజిటల్ క్లాస్ రూమ్, గ్రామంలో ఆర్ఓ వాటర్ ప్లాంట్ వంటివి ఏర్పాటుచేశారు రాయుడు సేవలను గుర్తించిన ఫిలాన్ త్రోపిక్ సొసైటీ 2024 ఉగాది నంది పురస్కారానికి ఎంపిక చేసి ఈ అవార్డును అందజేశారు. రాయుడుకు ఉగాది నంది పురస్కారాన్ని ఆంధ్రప్రదేశ్ మహిళా కమిషన్ ఛైర్‌పర్సన్ గజ్జల వెంకటలక్ష్మి రెడ్డి, శ్రీశ్రీ కళాఅకాడమి జాతీయ అధ్యక్షుడు కత్తిమండ ప్రతాప్, కేంద్ర సంగీత నాట్య అకాడమీ ఛైర్మన్ ఎస్పి భారతి, ఫిలాన్త్రోఫిక్ సొసైటీ వ్యవస్థాపకులు అద్దంకి రాజా చేతుల మీదుగా స్వీకరించారు. వెంకటేశ్వరరావును పలువురు అభినందించారు.

పోటీ పరీక్షల్లో శ్రీ చైతన్య విద్యార్థుల ప్రతిభ

ప్రజాశక్తి-మండపేట

ఇటీవల విడుదలైన ఐఎన్‌టిఎస్ఓ రెండవ దశ పోటీ పరీక్ష ఫలితాల్లో రాష్ట్ర స్థాయిలో ప్రథమ బహుమతి ల్యాప్‌టాప్ ను అందుకుని అత్యుత్తమ ప్రతిభ కనపరిచింది విద్యార్థిని రిషిత. ఈ సందర్భంగా మండలంలోని తాపేశ్వరం శ్రీ చైతన్య స్కూల్ విద్యార్థిని రిషితా మహలక్ష్మిని రూరల్ ఎస్ఐ ఎ.చైతన్య కుమార్ అభినందించారు అనంతరం విజేతకు ల్యాప్ టాప్ అందించి అభినందించారు. స్కూలు ప్రిన్సిపల్ లక్ష్మీనారాయణ మాట్లాడుతూ విద్యార్థి దశ నుంచే పిల్లలకు ఒలింపియాడ్ ఎగ్జామ్స్ లో కోచింగ్ ను ఇస్తూ ఇటువంటి రాష్ట్ర స్థాయి బహుమతులు గెలుచుకోవడం ఆనంద దాయకమన్నారు. లాప్ టాప్ తో పాటు తమ విద్యార్థులు 54 మంది ప్రత్యేక బహుమతులు స్మార్ట్ వాచెస్, స్కూల్ బాగ్స్, క్యాంపస్ బాక్సులు గెలుచుకున్నారని రీజనల్ ఇంచార్జి నరేష్ అన్నారు. కార్యక్రమంలో డీన్ అరుణ్, సి బ్యాచ్ ఇంచార్జి సతీష్ పాల్గొన్నారు.



విద్యార్థినికి ల్యాప్‌టాప్ అందజేస్తున్న ఎస్ఐ ఎ.చైతన్యకుమార్

ఇంటర్‌లో 'విద్యావికాస్' విజయకేతనం

ప్రజాశక్తి-మండపేట

స్థానిక విద్యావికాస్ కాలేజీ ఇంటర్మీడియట్ విద్యార్థులు శుక్రవారం వెలువడిన పరీక్షా ఫలితాల్లో విజయకేతనం ఎగురవేశారు. ఇంటర్ మొదటి సంవత్సరం ఎంపిసిలో నరుకుల మాధవి 462, బైపిసిలో వివిఆర్.సాయి శ్రీవల్లి 428 మార్కులతో ప్రతిభ కనబరిచారు. అలాగే ఇంటర్మీడియట్ రెండవ సంవత్సరంలో ఎంపిసి గ్రూపు నుంచి ఇంటి చిన్ని 983 మార్కులు సాధించి కాలేజ్ టాపర్ గా నిలిచాడు వీరిని శనివారం కళాశాల ప్రిన్సిపల్ టి.దుర్గారావు, డైరెక్టర్ వర్రె సత్యనారాయణ, అధ్యాపకులు అభినందించారు.

15న మండపేట మండల సర్వసభ్య సమావేశం

ప్రజాశక్తి-మండపేట

స్థానిక మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో మండల సర్వసభ్య సమావేశం 15వ తేదీ సోమవారం ఉదయం 10 గంటలకు నిర్వహిస్తారని ఎంపిపి ఉండమట్ల శ్రీనివాస్ తెలి పారు. ఈ సమావేశానికి ప్రజాప్రతినిధులు, అధికారులు తప్పనిసరిగా హాజరు కావాలని ఆయన కోరారు.

బాల బాలాజీ ఆలయానికి రూ.2.26 లక్షల ఆదాయం

ప్రజాశక్తి-మామిడికుదురు

అప్పనపల్లి శ్రీ బాలబాలాజీ స్వామి వారి ఆలయానికి దర్శనం, లడ్డు ప్రసాదం టిక్కెట్ల విక్రయాల ద్వారా శనివారం రూ.1,81,765, నిత్యాన్నదానట్రస్ట్‌కు రూ.44,641 మొత్తం 2,26,406 ఆదాయం సమకూరిందని ఆలయం సహాయకమిషనర్ గ్రంధి మాధవి తెలిపారు. 3164 మంది భక్తులు స్వామి వారిని దర్శనం చేసుకోగా 2380మంది అన్న ప్రసాదం స్వీకరించారన్నారు.



స్ట్రాంగ్ రూమ్ వద్ద కమిషనర్ దినేష్‌కుమార్ తదితరులు

ఇవిఎంలకు కట్టుదిట్టమైన భద్రత

ప్రజాశక్తి - రాజమహేంద్రవరం

రాజమహేంద్రవరం సిటీ అసెంబ్లీ నియోజకవర్గ ఇవిఎంలను, బ్యాలెట్, కంట్రోల్ యూనిట్లను కట్టుదిట్టమైన ఏర్పాట్ల మధ్య భద్రపరిచామని రాజమహేంద్రవరం సిటీ రిటర్నింగ్ అధికారి, మున్సిపల్ కమిషనర్ కె.దినేస్‌కుమార్ తెలిపారు. శనివారం ర్యాండమైజేషన్ ప్రక్రియ పూర్తి చేసిన అనంతరం రాజమహేంద్రవరం సిటీ అసెంబ్లీ నియోజకవర్గానికి సంబంధించి 310 ఇవిఎంలు, 285 కంట్రోల్ యూనిట్లు, 285 వివి ప్యాట్‌లను ఎస్‌కెవిటి డిగ్రీ కళాశాలలోని మొదటి అంతస్తులో ఏర్పాటు చేసిన తాత్కాలిక స్ట్రాంగ్ రూమ్‌నకు వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధుల సమక్షంలో తరలించి సీలు వేశామన్నారు. 12వ తేదీ రాత్రి రాజమహేంద్రవరం పార్లమెంటరీ నియోజకవర్గానికి సంబంధించిన ఇవిఎంలను స్ట్రాంగు రూములో ఉంచి సీలు వేశామన్నారు. స్ట్రాంగు రూముల వద్ద పటిష్టమైన పోలీసు భద్రతను ఏర్పాటు చేశామన్నారు. ఈ కార్యక్రమంలో తహశీల్దార్ కె.ఆంజనేయులు, ఎన్నికల సిబ్బంది, రాజకీయ పార్టీల ప్రతినిధులు పాల్గొన్నారు.



బాధితుడిని పరామర్శిస్తున్న నిమ్మకాయల రంగనాగ్

బాధితునికి రంగనాగ్ పరామర్శ

ప్రజాశక్తి - సామర్లకోట

ప్రమదంలో గాయపడి చికిత్స పొందుతున్న మండలంలోని హుస్సేన్‌పురం గ్రామానికి చెందిన నొక్కు వెంకటరమణను శనివారం ఎంఎల్‌ఎ నిమ్మకాయల చిన రాజప్ప తనయుడు నిమ్మకాయల రంగనాగ్ పరామర్శించా రు. హుస్సేన్‌పురంలోని వెంకటరమణ ఇంటికి చేరుకుని బాధితుడిని కలుసుకున్నారు. ప్రమాదానికి గల కారణాలను అడిగి తెలుసుకున్నారు. కుటుంబానికి అండగా ఉంటామని, ధైర్యంతో ఉండాలని సూచించారు. ఈ కార్యక్రమంలో గ్రామ నాయకులు చల్లా బుజ్జి, తలారి శ్రీను, కలవల చంద్రరావు, ముప్పిడి వెంకటరమణ, టి.వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

విజేతలకు నేడు బహుమతుల ప్రదానం

ప్రజాశక్తి - ఉంగ్రాజవరం

అంబేద్కర్ కల్చరల్ యూనియన్ ఆధ్వర్యంలో మండల కేంద్రం ఉండ్రాజవరంలో ఇటీవల నిర్వహించిన వాలీబాల్, కబడ్డీ, ముగ్గుల పోటీలు, చిన్నారులకు నిర్వహించిన మ్యూజికల్ చైర్స్ పోటీల్లో విజేతలకు నేడు బహుమతులు అందజేయనున్నట్లు యూనియన్ ప్రెసిడెంట్ తప్పిట్ల శేషగిరి శనివారం తెలిపారు. ఆదివారం అంబేద్కర్ 133వ జయంతిని పురస్కరించుకుని, ఉండ్రాజవరం, తాటిపర్రు రోడ్డు చర్చి ఎదురుగా ఉన్న అంబేద్కర్ సెంటర్ వద్ద 83 అడుగుల పొడవైన భారీ ఫ్లెక్సీని ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఈ సందర్భంగా యూనియన్ సభ్యులు మాట్లాడుతూ అంబేద్కర్ జయంతిని అత్యంత ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో యూనియన్ వైస్ ప్రెసిడెంట్ పెనుమాళ్ళ నాగేశ్వరరావు, సెక్రటరీ మానుకొండ సుందర్రావు, కన్వీనర్ కోట వెంకటరావు, సభ్యులు పెనుమాళ్ళ షాలెం మర్రి జయబాబు, కాకిలేటి సుజయబాబు పాల్గొన్నారు.



అంబేద్కర్ భారీ ఫ్లెక్సీని ఏర్పాటు చేస్తున్న సభ్యులు

జిల్లా అంతటా రాజకీయ వేడి



ప్రజాశక్తి- రాజమహేంద్రవరం ప్రతినిధి

ఒక పక్క భానుడి భగభగలకు మరో పక్క రాజకీయం తోడవ్వడంతో జిల్లా వ్యాప్తంగా రాజకీయాలు వేడెక్కాయి. ఎన్నికల సమయం దగ్గర పడుతుండటంతో అధికార వైసిపి, ప్రతిపక్ష టిడిపి కూటమి ప్రచారాల్లో వేగాన్ని పెంచాయి. రోడ్‌షోలు, బహిరంగ సభలను నిర్వహిస్తూ ఆ పార్టీ కార్యకర్తలలో నూతనోత్సాహాన్ని నింపు తున్నాయి. టిడిపి కూటమి ఆధ్వర్యంలో గత వారంలో నిడదవోలు, అమలాపురం పట్టణాల్లో బహిరంగ సభలు జరిగాయి. ఈ సభల్లో టిడిపి అధినేత చంద్రబాబు, జనసేన అధినేత పవన్‌కళ్యాన్, బిజెపి రాష్ట్ర అధ్యక్షులు పురంధేశ్వరి పాల్గొన్నారు. ప్రసంగాలతో కార్యకర్తలను ఉత్సాహ పర్చారు. అధికార పార్టీపై నిప్పులు చెరగడంతో పాటూ కూటమి అభ్యర్థులను గెలిపించుకు నేందుకు అసంతృప్తులు పక్కన పెట్టాలంటూ హితవు పలికారు. మరోపక్క ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి బస్సు యాత్రకు సన్నాహాల్లో అధికార పార్టీ నాయకుల నిమగ్నమయ్యారు.

కాంగ్రెస్‌లో నూతనోత్సాహం

2024 సార్వత్రిక ఎన్నికలకు మిత్రపక్షాల మద్దతు కాంగ్రెస్ సన్నద్ధమవుతోంది. ఎన్నికలు సమీపిస్తున్న నేపథ్యంలో ఆ పార్టీలోనూ నూతనోత్సాహం వెల్లి విరుస్తోంది. మతతత్వ బిజెపికి వ్యతిరేకంగా దేశ వ్యాప్తంగా కాంగ్రెస్, సిపిఐ, సిపిఎంలతో పాటు ఇతర పార్టీలను కలుపుకుని ఇండియా ఫోరం ఏర్పాటు చేసిన విషయం విధితమే. ఉమ్మడి జిల్లాలో రెండు పార్లమెంటు స్థానాలతో పాటు పలు అసెంబ్లీ స్థానాలకు కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులను ప్రకటించింది. ఈ నేపథ్యంలో ప్రచార కార్యక్రమాలను ప్రారంభించింది. ప్రచారంలో భాగంగా కేంద్రంలోని బిజెపి అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలను వివరిస్తూ ముందుకు సాగుతున్నారు. దాదాపు దశాబ్దాల కాలం తర్వాత ఆ పార్టీలో నూతనోత్సాహం వెల్లివిరుస్తోంది.

భానుడి భగభగలు

వేసవి ఉష్ణోగ్రతలు జిల్లా వాసులను ఠారెత్తిస్తున్నాయి. రోహిణీ కార్తెకు మునుపే ఒక్క సారిగా ఎండలు పెరిగాయి. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా సరాసరిన 40 డిగ్రీల సెల్సియస్‌కు పైగా ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. రాజమహేంద్రవరం, కాకినాడ, అమలాపురం జిల్లా కేంద్రాలతో పాటు ఇతర పట్టనాలు, పల్లెల్లో సైతం వేసలి గాల్పులు క్రమంగా పెరుగుతున్నాయి. ఈ నేపథ్యంలో ప్రజలు ఇంటినుంచి బయటకు వచ్చేందుకే వెనకడుగు వేస్తున్నారు. మధ్యాహ్నం 12 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకూ ముఖ్య కూడళ్లు వెలవెలబోతున్నాయి. అత్యధిక మంది హోల్ సెల్ వ్యాపారులు తమ దుకాణాలను మూసివేసి తిరిగ సాయంత్రం తీస్తున్నారు. వేతన జీవులు ఉపాధి కోసం ఎండలోనే పనులు చేస్తున్నారు. కార్పొరేషన్‌లు, మున్సిపాలిటీలు, పలు స్వచ్ఛంధ సంస్థలు నిర్వహిస్తున్న చలివేంద్రాలు కొంత ఊరట నిస్తున్నాయి. ప్రజల దప్పికను తీరుస్తున్నాయి. వడగాల్పులకు అనారోగ్య సమస్యలు పరిపాటిగా మారాయి. అక్కడక్కడా వడదెబ్బ మృతులు నమోదవదుతున్న నేపథ్యంలో వైద్య ఆరోగ్య శాఖ అప్రమత్తమవ్వాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

అప్రకటిత విద్యుత్ కోతలు

జిల్లాలో ఓ వైపు పెరుగుతున్న ఉష్ణోగ్రతలతో పాటు, విద్యుత్ శాఖ విధిస్తున్న విద్యుత్ అప్రకటిత కోతలు గోరుచుట్టుపై రోకలి పోటులా మారాయి. రైతుల విద్యుత్ కనెక్షన్‌లతో పాటు గృహ విద్యుత్ వినియోగదారులకు అవస్థలు తప్పటంలేదు. మరమ్మతులు, ఆధునీకరణ పేరుతో విద్యుత్‌కోతలపై అధికారులు ముందుగానే ప్రకటనలు ఇస్తున్నా నిర్దేశిత సమయానికి సరఫరా పునరుద్ధరించటంలేదనే విమర్శలు విన్పిస్తున్నాయి. దీనిపై ఆ శాఖ ఉన్నతాధికారులు దృష్టి సారించాల్సి ఉంది. ఓ వైపు ఎండలు, మరోవైపు విద్యుత్ కోతల నేపథ్యంలో ఉమ్మదీత, ఉక్కపోతతో ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని వాపోతున్నారు. విద్యుత్ కోతలు కంటిమీద కునుకు లేకుండా చేస్తున్నాయి. విద్యుత్ వినియోగం జిల్లాలో 21 మిలియన్ యూనిట్లకు చేరటంతో అప్రకటిత విద్యుత్ కోతలు అనివార్యంగా మారటంతో ప్రజలు అవస్తలు పడుతున్నారు.

విజయమే లక్ష్యంగా సిఎం బస్సు యాత్ర

ఈనెల 19న కాకినాడ రాక

రీజనల్ కో-ఆర్డినేటర్ ఎంపీ మిథున్‌రెడ్డి

ప్రజాశక్తి - కాకినాడరూరల్

ఎన్నికల్లో మరోసారి విజయమే లక్ష్యంగా ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి మేమంతా 'సిద్ధం' బస్సు యాత్ర చేపట్టారని రీజనల్ కో-ఆర్డినేటర్ ఎంపి మిథున్ రెడ్డి పేర్కొన్నారు.ఈనెల 19న జగన్ బస్సు యాత్ర కాకినాడరూరల్ అచ్చంపేట చేరుకోనుందని తెలిపారు. ఈ నేపథ్యంలో స్థానిక ఎంఎల్‌ఎ క్యాంప్ కార్యాలయంలో రీజనల్ కోఆర్డినేటర్ ఎంపీ మిథున్ రెడ్డి 11 నియోజకవర్గాల శాసనసభ్యులు, పార్లమెంట్ అభ్యర్థి చలమలశెట్టి సునీల్‌తో సమీక్ష సమావేశం నిర్వహించి దిశానిర్దేశం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మరోసారి అధికారంలోకి రావడమే లక్ష్యంగా 'మేమంతా సిద్ధం'పేర బస్సు యాత్ర ప్రజల్లోకి వెళ్తున్నామని చెప్పారు. ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డి ఎన్నికల ప్రచారంలో భాగంగా చేపట్టిన బస్సుయాత్రకు ప్రజలు బ్రహ్మరథం పడుతున్నారన్నారు. అడుగడుగునా జగన్ పాలనకు మద్దతు తెలుపుతూ కదం తొక్కుతున్నారన్నారు. పాలనను ప్రజల ఇంటికే తీసుకొచ్చి, చేతిలో పథకాలను పెట్టిన నాయకుడి వెంటే 'మేమంతా' అంటూ జనం ఎలుగెత్తి చాటుతున్నారని చెప్పారు. మేము సిద్ధం సభలో లక్షల్లో ప్రజలు పాల్గొంటున్నారని వచ్చేది మరల వైసిపి ప్రభుత్వమేనని ధీమా వ్యక్తం చేశారు. ఈనెల 19వ తేదీన



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీ మిథున్‌రెడ్డి

కాకినాడ రూరల్ అచ్చంపేటకు ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి సిద్ధం బస్సు యాత్ర రానున్నదన్నారు. అదే రోజు మధ్యాహ్నం మూడు గంటలకు మేమంతా సిద్ధం సభలో ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి పాల్గొంటారన్నారు. ఈ సభను జయప్రదం చేయాలని ఆయన కోరారు. అనంతరం పార్లమెంట్ అభ్యర్థి చలమలశెట్టి సునీల్ మాట్లాడుతూ జగన్మోహన్ రెడ్డి బస్సు యాత్రకు వస్తున్న ఆదరణ చూస్తుంటే ఉభయగోదావరి జిల్లాల్లో మెజారిటీ సీట్లులో వైసిపి విజయం ఖాయమని తెలుస్తోందన్నారు. కాకినాడ పార్లమెంటు పరిధిలోని ఏడు నియోజకవర్గాల్లో వైసిపి విజయం తథ్యమని ఆయన తెలిపారు. అనంతరం రూరల్ శాసనసభ్యులు కురసాల కన్నబాబు మాట్లాడుతూ మేమంతా సిద్ధం సభలు విజయవంతంగా జరుగుతున్నాయన్నారు. 40 సంవత్సరాల ఇండస్ట్రీ అని ముఖ్యమంత్రిగా చేసిన చంద్రబాబుకు మైండ్ చెదిరి ముఖ్యమంత్రి స్థాయి మనిషిని అగౌరవంగా మాట్లాడుతున్నారని అన్నారు. డబ్బులు తీసుకుని జనసేన పార్టీ టికెట్స్ ఇస్తుందని ఆరోపించారు. వైసిపి కుటుంబ సభ్యులందరూ ఈ సభలో పాల్గొని విజయవంతం చేయాలని ఆయన కోరారు. ఈ సమావేశంలో ఎస్‌సి కార్పొరేషన్, రాష్ట్ర మాల కార్పొరేషన్ డైరెక్టర్ పెదపాటి అమ్మాజీ, రాష్ట్ర సివిల్ సప్లయీస్ డైరెక్టర్, ఉభయగోదావరి జిల్లాల మహిళా విభాగం జోనల్ ఇన్‌ఛార్జి జమ్మలమడక నాగమణి, వైసిపి నాయకులు, కార్యకర్తలు అభిమానులు తదితరులు పాల్గొన్నారు.

పిఠాపురంపై స్పెషల్ ఫోకస్ అవసరం లేదు: మిథున్‌రెడ్డి

మిథున్ రెడ్డిలు ఎంతమంది పిఠాపురం వచ్చినా జనసేనను పీకేది ఏమి లేదని జనసేన అధినేత పవన్ కళ్యాణ్ వ్యాఖ్యలపై విలేకర్లు అడిగిన ప్రశ్నకు మిథున్‌రెడ్డి తెలిపారు. రాష్ట్రంలోని 175 అసెంబ్లీ నియోజకవర్గాల్లో పిఠాపురం ఒకటని, దానిపై ప్రత్యేకంగా ఫోకస్ చేయాల్సిన అవసరం తమకు లేదన్నారు. భీమవరం, గాజువాకలో ఓడిన పవన్ కళ్యాణ్.. ఈసారి కొత్తగా పిఠాపురంలో ప్రచారం చేసుకుంటున్నారని తెలిపారు. ఈ సెగ్మెంట్లో వైసిపి నుంచి వంగా గీత బలమైన అభ్యర్థి అని పేర్కొన్నారు. మొదటి నుంచి జనసేనలో ఉన్నవారికి పవన్ న్యాయం చేయలేదని ఆయన విమర్శించారు.

జగన్‌తోనే సంక్షేమం, అభివృద్ధి

ఎంఎల్‌ఎ పొన్నాడ సతీష్‌కుమార్

ప్రజాశక్తి- తాళ్లరేవు

ముఖ్యమంత్రి వైఎస్.జగన్మోహన్‌రెడ్డి హయాంలోనే రాష్ట్రంలో అభివృద్ధి జరిగిందని, రాష్ట్ర ప్రజలకు సంక్షేమం పథకాలు అందాయని ఎంఎల్‌ఎ పొన్నాడ వెంకటసతీష్‌కుమార్ అన్నారు. అందుకే మళ్లీ జగనే సిఎం కావాలని ప్రజలు కోరుకుంటున్నారన్నారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా మండలంలోని సుంకరపాలెం, ఉప్పొంగల, లచ్చిపాలెం గ్రామాల్లో వైసిపి నాయకులు పితాని బాలకృష్ణతో కలిసి ఎంఎల్‌ఎ సతీష్‌కుమార్ పర్యటించారు. ఈ సందర్భంగా సుంకరపాలెం పంచాయతీ చింతాకుల వారి పేట, ఎమ్‌డి.పేటలో ఇంటింటా ప్రచారం చేశారు. బాబానగర్, ఉప్పంగలలో రోడ్ షో నిర్వహించారు. ఈ సందర్భంగా నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఎంఎల్‌ఎ పొన్నాడ మాట్లాడారు. మ్మెల్యే మాట్లాడారు. తకల వారి పేట ఎండి పేటలో చింతాకుల వారి పేట, ఎండిపేటలో వాటర్ ట్యాంకులు నిర్మించి తాగునీటి సమస్యను శాశ్వతంగా పరిష్కరించామన్నారు. జగనన్న పాలనలో ముఖ్యంగా మహిళా ఓటర్లు మళ్లీ జగనే సిఎం కావాలని కోరుకుంటున్నారని, ప్రభుత్వ విజయంలో మహిళా ఓటర్లు కీలకపాత్ర వహించనున్నారని తెలిపారు. ఎన్నికల్లో ఫ్యాన్ గుర్తుకు ఓటు వేసి గెలిపించాలని అభ్యర్థించారు. ఇంటింటా కరపత్రాలను అందించారు. ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు బొంతు సత్యనారాయణ, బొంతు శ్రీనివాస్,



ప్రచారం నిర్వహిస్తున్న ఎంఎల్‌ఎ పొన్నాడ సతీష్‌కుమార్

చీకట్ల జగన్మోహన్, చింతాకుల రాంబాబు, సుబ్రహ్మణ్యం, ఎంపిటిసి సభ్యులు గుత్తుల శ్రీనివాస్, రేకాడి నరసింహమూర్తి, దవులూరి శ్రీరామ్మూర్తి, ఇంజరం సర్పంచ్ ముద్దన వెంకట శివరామ ప్రసాద్, పెయ్యల కొండబాబు, నరహరిశెట్టి విగ్నేశ్వరరావు, సుంకర బద్రి, జడ్‌పిటిసి సభ్యులు దొమ్మేటి సామ్యూల్ సాగర్, మండల నాయకులు దున్న జనార్ధనరావు, కాదా గోవింద కుమార్, కాశి లక్ష్మణస్వామి, తదితరులు పాల్గొన్నారు.